VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 132 విశాఖపట్నం, 27 ఫిబ్రవరి 2026 శుక్రవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

**మంచిమాట**

ఎంత ఆస్తి ఉన్నా తినేది ఆహారాన్నే..
మనకెంత గుర్తింపు ఉన్నా అందరూ
చూసేది మంచిగుణాన్నే..
ఏ కులంలో పుట్టినా అందరూ చూసేది
మంచితనాన్నే..
మనదెంత గొప్పమతమైనా అందరూ
చూసేది మానవత్వాన్నే..
ధనముంటే ధనవంతుడు అంటారు..
అదే దానం చేస్తే భగవంతుడు అంటారు..!!

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

# గంగా-కావేరి అనుసంధానం
# నా ప్రగాఢ ఆకాంక్ష: చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమచారమ్, ఫిబ్రవరి 26 :** ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణాకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా- కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు.

"ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారు" అని చంద్రబాబు అన్నారు.

**ప్రాజెక్టుల పూర్తికి బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తున్నాం: చంద్రబాబు**

పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను తరలిస్తాం. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. అందుకు మేం అభ్యంతరం చెప్పలేదు. ఆ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాలకు లాభం. పోలవరం డయాఫ్రంవాల్ కొట్టుకుపోతే గుర్తించలేని పరిస్థితి గత పాలకులది. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు.

# వాయుసేన విన్యాసాలు..
# 'ప్రచండ్'లో ప్రయాణించనున్న రాష్ట్రపతి



**రాజస్థాన్ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్థాన్‌లో పర్యటించ నున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్' లో గగన విహారం చేయనున్నారు. అనంతరం భారత్- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం ఆధ్వర్యంలో 'వాయు శక్తి' పేరిట నిర్వహించనున్న విన్యాసాలను వీక్షించనున్నారు.

ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' అనేది స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి యుద్ధ హెలికాప్టర్. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ దీన్ని తయారుచేసింది. 2022 అక్టోబరులో వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. ఎడారుల నుంచి పర్వతాల వరకు విభిన్న ప్రాంతాల్లో దీన్ని నడపొచ్చు. 5,000 మీటర్ల పైన ఎత్తులోనూ ఎగరగలదు. ముఖ్యంగా పర్వత ప్రాంత సరిహద్దుల వెంట మోహరింపునకు ఇది అనుకూలంగా ఉంటుంది. అధునాతన ఏవియానిక్స్, స్టెల్త్ ఫీచర్లు, రాత్రి వేళల్లోనూ దాడులు చేయగల సామర్థ్యం దీని సొంతం. క్షిపణులు, రాకెట్లు, 20 ఎంఎం గన్ వంటి ఆయుధాలను ప్రయోగించవచ్చు.

**పాక్ ఊహల్లో బతుకుతున్నట్లుంది : భారత్ చురకలు**

రాష్ట్రపతి ముర్ము 2023 ఏప్రిల్‌లో అస్సాంలోని తేజ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. గతేడాది అక్టోబరులో అంబాలాలో రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ముర్ము నిలిచారు. గతేడాది డిసెంబరులో కర్ణాటకలోని కార్వార్ తీరంలో కల్వరి శ్రేణి జలాంతర్గామి 'ఐఎన్ఎస్ వాఘ్‌షీర్'లో ప్రయాణించారు.




# మండలిలో సోము వీర్రాజుపై దాడికి వైకాపా సభ్యుల యత్నం

**అమరావతి, విశాఖ సమచారమ్, ఫిబ్రవరి 26 :** ఏపీ శాసన మండలిలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు పైకి వైకాపా సభ్యులు ఇస్రాయెల్, విక్రాంత్, రమేశ్ యాదవ్ దూసుకెళ్లారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం పూర్తయిన తర్వాత చర్చకు వైకాపా సభ్యులు పట్టుబట్టారు. మంత్రి సమాధానం పూర్తవడంతో తర్వాత ప్రశ్నకు మండలి ఛైర్మన్ అవకాశం కల్పించారు. దీంతో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడేందుకు యత్నించారు.

ఈ క్రమంలో ఆయన పైకి ఎమ్మెల్సీ ఇస్రాయెల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన కొందరు సభ్యులు దూసుకెళ్లారు. తాము నిరసన తెలుపుతుంటే మైక్ ఎందుకు తీసుకున్నారంటూ వీర్రాజుపై దాడికి యత్నించారు. సోము వీర్రాజుకు మద్దతుగా మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ వెళ్లి అడ్డుకున్నారు. ఉద్రిక్త వాతావరణం మధ్య సభను మండలి ఛైర్మన్ మోషేనురాజు కాసేపు వాయిదా వేశారు.

# రాయలసీమకు నిజమైన ద్రోహి జగనే
## మంత్రి నిమ్మల రామానాయుడు




**అమరావతి, విశాఖ సమచారమ్, ఫిబ్రవరి 26 :** రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఏపీ శాసన మండలిలో అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపా సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ దద్దరిల్లింది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఆపిందని.. ఆ ప్రాంతానికి సీఎం చంద్రబాబు అన్యాయం చేశారని వైకాపా సభ్యులు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంతో లాలూచీ పడి ప్రాజెక్టును నిలిపివేశారని ఆ పార్టీ సభ్యులు ఇషాక్ బాషా, రామసుబ్బారెడ్డి ఆరోపించారు.

**అధికారంలో ఉన్నప్పుడు వైకాపా పట్టించుకోలేదు**

వైకాపా ఆరోపణలను మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తిప్పికొట్టారు. జగన్ సీఎంగా ఉండగానే ఆ ప్రాజెక్టును ఎన్జీటీ ఆపిందని.. జరిమానా కూడా విధించిందని నిమ్మల గుర్తుచేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ప్రాజెక్టు గురించి కనీసం పట్టించుకోలేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి నిజమైన ద్రోహి జగన్ అని.. ఆయన్ను నిలదీయకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైకాపా హయాంలోనే సీమలోని ప్రాజెక్టులన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ఆ ప్రాంతానికి నీరిచ్చేందుకు ఒక్క ప్రాజెక్టునూ జగన్ చేపట్టలేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాగునీటి కోసం కాదు.. తాగునీటి కోసమని వైకాపా ప్రభుత్వం 2023 ఆగస్ట్ 18న జీవో నంబర్ 364 సహా అఫిడవిట్ ఇచ్చిన విషయాన్ని నిమ్మల సభ దృష్టికి తీసుకొచ్చారు.

**అప్పుడు హరీశ్‌రావు ఏం చెప్పారో తెలుసుకోండి..**

మంత్రి సమాధానంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సహా వైకాపా సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఎక్కడా సమాధానం ఇవ్వలేదంటూ నిరసన తెలిపారు. దీంతో సభను మండలి ఛైర్మన్ ⏭ తరువాయి 2లో..

# కల్తీ నెయ్యిపై చర్చకు వైకాపాకి భయమెందుకు?: పయ్యావుల




**అమరావతి, విశాఖ సమచారమ్, ఫిబ్రవరి 26 :** కల్తీ నెయ్యి అంశంపై శాసన మండలిలో గందరగోళం నెలకొంది. చర్చకు ప్రతిపక్షానికి ముందుగా అవకాశం ఇస్తామని మండలి ఛైర్మన్ మోషేను రాజు అన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్ వద్దంటారా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "స్టేట్‌మెంట్ ఇస్తామని మేము ముందే చెప్పాం. లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంత సమయమైనా చర్చకు అనుమతించండి. అర్ధరాత్రి వరకు చర్చ కొనసాగించినా మాకు ఇబ్బంది లేదు. వినేందుకు కూడా ఓపిక లేనప్పుడు ప్రశ్నలు ఎందుకు అడగాలి. చర్చకు వైకాపా సభ్యులు ఎందుకు భయపడుతున్నారు" అని ప్రశ్నించారు. సభ్యుల నినాదాల మధ్యే సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషేను రాజు ప్రకటించారు.

**వైకాపా సభ్యులకు చర్చపై ఆసక్తి లేదు: పయ్యావుల**

" వైకాపా సభ్యులకు చర్చపై ఎలాంటి ఆసక్తి లేదు. చర్చ చేపట్టాలని శాసనసభకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. ప్రభుత్వం ముందుకు వచ్చి వైకాపా సభ్యుల నోటీసుపై చర్చ చేపట్టింది. బీఏసీలో వైకాపా లేవనెత్తిన అంశాలపైనే చర్చ పెడతామని చెప్పాం. శాంతిభద్రతలు, వ్యవసాయం, నీటిపారుదల, తిరుమల లడ్డూపై చర్చకు సిద్ధమయ్యాం. శాసనభలో ప్రతిపక్షం లేకపోయినా బీఏసీలో లేవనెత్తిన అంశాలపై చర్చించాం. తిరుమల లడ్డూ అంశంపై వాస్తవాలు ప్రజలకు చెప్పాలనేది మా ఉద్దేశం. లడ్డూ అంశంపై స్వల్పకాలిక చర్చకు అవకాశం ఇవ్వాలని ధూళిపాళ్ల లేఖ రాశారు. ప్రతిపక్షం లేకపోయినా సంప్రదాయాలను కచ్చితంగా పాటిస్తున్నాం. తిరుమల లడ్డూ అంశంపై వైకాపా ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. వైకాపా సభ్యులకు అల్లరి కావాలి..అందుకే సభలో చర్చ జరగలేదని దుష్ప్రచారం చేస్తున్నారు" అని మీడియా పాయింట్ వద్ద మంత్రి పయ్యావుల తెలిపారు.

# కార్నీ భారత్ పర్యటన వేళ
## స్వరం మార్చిన కెనడా



**కెనడా :** జస్టిన్ ట్రూడో హయాంలో ఒడు దొడుకులకు గురైన భారత్-కెనడా సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి. ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ భారత్‌తో స్నేహానికి మొగ్గు చూపుతున్నారు. ఆయన మన దేశ పర్యటనకు రానున్నారు. ఇలాంటి సమయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. మన ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను కెనడా అధికారులు వెనక్కి తీసుకున్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

రెండేళ్ల క్రితం.. కెనడా ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయంటూ అక్కడి విపక్షాలు ఆరోపించాయి. దాంతో అప్పటి ట్రూడో ప్రభుత్వం ఒక స్వతంత్ర కమిషన్ ఏర్పాటుచేసింది. ఆ క్రమంలో జరిగిన దర్యాప్తులో భారత్ ⏭ తరువాయి 2లో..

# దేశాల పరస్పర సహకారానికి మిలన్ దోహదం

- ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ అలోక్ ఆనంద్
- ఐఎన్ఎస్ విక్రాంత్‌పై వివిధ దేశాల నౌకాదళ అధికారులు



**విశాఖపట్నం (సింధియా), విశాఖ సమచారమ్, ఫిబ్రవరి 26 :** హిందూ మహాసముద్రంలో దేశాల నడుమ మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహించిన 'మిలన్-2026' విన్యాసాలు విజయవంతంగా ముగిశాయని ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ అలోక్ ఆనంద అన్నారు. బుధవారం మిలన్-26 సముద్ర విన్యాసాల ముగింపు వేడుకలను 'ఐఎన్ఎస్ విక్రాంత్'పై నిర్వహించారు. ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విశాఖ వేదికగా అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్), మిలన్ విన్యాసాలు ఏకకాలంలో నిర్వహించడం గొప్ప విషయమని అలోక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో 74 దేశాలు పాల్గొన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రతి 50 రోజులకు ఒక యుద్ధనౌక నౌకాదళంలో చేరుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

# సిట్ ఎదుట లొంగిపోయిన అవినాష్‌రెడ్డి



**విజయవాడ, విశాఖ సమచారమ్, ఫిబ్రవరి 26 :** మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాష్‌రెడ్డి సిట్ ఎదుట లొంగిపోయారు. విజయవాడలోని సిట్ కార్యాలయానికి ఆయన తన న్యాయవాదితో కలిసి వచ్చారు. ⏭ తరువాయి 2లో..

## కాశీలో గంగమ్మ అలలపై మెక్సికో జంటకు పడవ పెళ్లి

**మెక్సికో :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఆకర్షితులు అవుతున్న ఎన్నో విదేశీ జంటలు వారణాసి వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను వేదికగా చేసుకొని ఒక్కటవుతున్నాయి. రూయిజ్ కాబ్రోల్, గొంజలో మిగ్యుల్‌ల జంట సైతం ఇదే ఆలోచనతో మెక్సికో నుంచి వారణాసికి వచ్చింది. అస్సీ ఘాట్ వద్ద నీటిపై ఉన్న పడవలో వేదమంత్రాల నడుమ అగ్నిసాక్షిగా ఈ జంట పెళ్లి విన్నూత రీతిలో జరిగింది. వరుడు ధోవతి, కుర్తాలతో తలపాగా ధరించగా.. వధువు బనారస్ చీరలో మెరిసిపోయింది. ఆచార్య దీపక్ పాండే పెళ్లి మంత్రాలు చదివారు. దేశ, విదేశీ పర్యాటకులు ఘాట్ వద్ద గుమికూడి ఈ వేడుకను ఆసక్తిగా తిలకించారు. కొత్తజంటపై కొందరు పూలవర్షం కురిపించారు. ఈ అద్భుతమైన క్షణాలు భిన్న సంస్కృతుల సంగమం అంటూ పలువురు తమ కెమెరాల్లో చిత్రీకరించారు.

## ఇన్‌స్టాలో మోదీ క్రేజ్ 10 కోట్లు దాటిన ఫాలోవర్లు



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ క్రేజ్ రోజురోజుకి పెరిగిపోతోంది. బయటే కాకుండా సామాజిక మాధ్యమాల్లో కూడా ఆయన హవా కొనసాగుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లు దాటింది. ప్రపంచంలో ఇంతమంది ఫాలోవర్లు ఉన్న రాజకీయ నేతగా ఆయన రికార్డు సృష్టించారు.

2014 నుంచి మోదీ ఇన్‌స్టాగ్రామ్ వినియోగించడం ప్రారంభించారు. మరో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఇప్పటికే ఆయనను అనుసరించే వారి సంఖ్య 10 కోట్లు దాటేసింది. కాగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే.. మోదీ ఫాలోవర్ల సంఖ్య రెండు రెట్లు ఎక్కువ. 4.3 కోట్ల మంది ఫాలోవర్లతో ట్రంప్ రెండో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో (1.5 కోట్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా (1.4 కోట్ల మందికి పైగా), తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ (1.1కోట్లు), అర్జెంటీనా అధ్యక్షుడు హవియేర్ మిలే (64 లక్షలు) ఉన్నారు. ఇక, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 1.2 కోట్లు మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.

## పాక్ ఊహల్లో బతుకుతున్నట్లుంది : భారత్ చురకలు



**పాకిస్థాన్ :** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు భారత్ మరోసారి చురకలు అంటించింది. జమ్మూకశ్మీర్ అభివృద్ధిని చూడలేదంటే పాక్ ఊహల్లో విహరిస్తూ ఉండొచ్చంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. అలాగే జమ్మూకశ్మీర్ ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఐరాస మానవ హక్కుల మండలి సమావేశంలో భారత దౌత్యవేత్త అనుపమాసింగ్ స్పందించారు.

"జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. పాక్ ప్రచారం ఆ వాస్తవాన్ని మార్చలేదు. ఆ దేశం చట్టవిరుద్ధంగా ఆక్రమించిన ప్రాంతాలను ఖాళీ చేయాలి. పాక్ ప్రచారం చేస్తోన్న ఉగ్రవాద భావజాలాన్ని జమ్మూకశ్మీర్ ప్రజలు తిరస్కరిస్తున్నారనడానికి.. సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ నమోదైన రికార్డు స్థాయి ఓటింగే నిదర్శనం. అక్కడి ప్రజలు అభివృద్ధి, ప్రజాస్వామ్య మార్గంలో ముందుకు వెళ్తున్నారు. గత ఏడాది అక్కడ ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చీనాబ్ రైల్ బ్రిడ్జ్ ప్రారంభమైంది. అది నకిలీదని భావిస్తే.. పాకిస్థాన్ ఊహల్లో బతుకుతున్నట్లే. జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం కేటాయించిన బడ్జెట్.. ఐఎంఎఫ్ నుంచి దాయాది కోరిన బెయిలౌట్ ప్యాకేజీ కంటే రెట్టింపే. అది కూడా వారికి నమ్మశక్యం కాకపోవచ్చు" అని సింగ్ విమర్శించారు. ప్రజాస్వామ్య ప్రక్రియ గురించి ఆ దేశం ఉపన్యాసాలు ఇవ్వడం చిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు.

# రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసు

### ఛార్జ్‌షీట్‌లో నటి రన్యారావు పేరు



**బెంగళూరు:** అక్రమ బంగారం తరలించిన కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావు మరిన్ని చిక్కుల్లో పడింది. రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసులో ఆమెపై ఆరోపణలు రాగా.. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ఆమె పేరు కూడా ఉంది. స్మగ్లింగ్ సిండికేట్ ఒక ఏడాదిలో 127 కిలోల బంగారాన్ని భారత్‌కు స్మగ్లింగ్ చేసిందని ఆరోపణలు వచ్చాయి. తమ హ్యాండ్లర్లు, ఆభరణాల వ్యాపారులు దానిని దేశీయ మార్కెట్‌లోకి చొప్పించారని ఈడీ దర్యాప్తులో గుర్తించింది. దీంతో బెంగళూరులోని పీఎంఎల్‌ఏ కోర్టులో ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దానిలో రన్యా పేరుతో పాటు ఆమె సహాయకుడిగా భావిస్తోన్న తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన గోల్డ్ డీలర్ సాహిల్ జైన్ పేర్లను చేర్చింది.

దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ రన్యారావు గతేడాది బెంగళూరు విమానాశ్రయంలో దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆమె నుంచి 14.7 కిలోల బంగారాన్ని డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాలో కొన్నేళ్లుగా ఆమె ప్రధాన పాత్ర పోషించినట్లు దర్యాప్తులో భాగంగా అధికారులు గుర్తించారు. ఆమె స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో కలిసి పనిచేసిందని వెల్లడించారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం అక్రమ రవాణా చేసేందుకు భారీ మొత్తంలో కమిషన్ తీసుకునేదని పేర్కొన్నారు. ఈ కేసులో ఆమెకు ఏడాది జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే.

# బికినీ అమ్మాయిలతో స్టీఫెన్ హాకింగ్

**న్యూఢిల్లీ :** ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మరో సంచలనం వెలుగులోకి వచ్చింది. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్‌కు ఇరువైపులా బికినీ ధరించిన ఇద్దరు మహిళలు ఉన్న ఫొటోలు కలకలం రేపుతున్నాయి. ఓ దీవిలోని ఎప్‌స్టీన్ ఎస్టేట్‌లో హాకింగ్ గడిపినట్లు బయటపడింది. చేతిలో కాక్‌టెయిల్ పట్టుకుని, సన్ లౌంజర్‌పై పడుకుని ఉన్న హాకింగ్‌ను ఆ మహిళలు పట్టుకుని ఉన్నారు. 'ది ఇండిపెండెంట్' కథనం ప్రకారం.. హాకింగ్‌తో ఉన్న ఆ ఇద్దరు అమ్మాయిలు.. ఆయనకు సేవ చేసేవారని తెలిపింది. వారు హాకింగ్‌కు దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సంరక్షకులని.. హాకింగ్‌కు ఉన్న అనారోగ్య కారణాల దృష్ట్యా వారికి 24 గంటల వైద్య సహాయం అవసరం కాబట్టే.. వారు అక్కడ ఉన్నారని వెల్లడించింది.

ఓ సందర్భంలో హాకింగ్ జలాంతర్గామిలో ప్రయాణించినట్లు కూడా ఫొటో ఉంది. అండర్ వాటర్ వెసల్‌ను హాకింగ్ కోసం ఎప్‌స్టీన్ మార్పులు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2006లో సెయింట్ థామస్‌లోని రిట్జ్ కార్లటన్ హోటల్‌లో జరిగిన సైన్స్ సదస్సు సమయంలో ఆ ఫొటో తీసినట్లు భావిస్తున్నారు. సెయింట్ జేమ్స్ దీవిలో ఉన్న ఎప్‌స్టీన్ రిసార్టును విజిట్ చేసిన 21 మంది శాస్త్రవేత్తల్లో హాకింగ్ కూడా ఒకరు. హాకింగ్‌కు చెందిన 250 ఫొటోలు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నట్లు సమాచారం. దీనిపై హాకింగ్ కుటుంబ సభ్యులు కూడా స్పందించారు. ఆ ఇద్దరు మహిళలు యూకేకు చెందిన ఆయన దీర్ఘకాలిక సంరక్షకులని తెలిపారు ఆయన ప్రవర్తనపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేసినా తప్పేనంటూ.. ఆరోపణలను కొట్టిపారేశారు. అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో హాకింగ్ పేరు కనీసం 250 సార్లు ప్రస్తావించబడింది. తాజా పత్రాలలో భాగంగా విడుదలైన ఈ ఫొటోలో, హాకింగ్ ఇద్దరు మహిళల మధ్య చిరునవ్వుతో కనిపిస్తున్నారు.



స్టీఫెన్ హాకింగ్ జనవరి 8, 1942న ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివారు. ఆ తర్వాత కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కాస్మోలజీ (విశ్వాంతరాళ శాస్త్రం)లో పిహెచ్‌డీ చేశారు. 21 ఏళ్ల వయసులో ఆయనకు అరుదైన మోటార్ న్యూరాన్ వ్యాధి సోకింది. ఈ వ్యాధి కారణంగా ఆయన శరీరం పూర్తిగా పక్షవాతానికి గురైంది. మాట్లాడే శక్తిని కోల్పోవడంతో, ఒక ప్రత్యేకమైన వాయిస్ సింథసైజర్ (కంప్యూటర్ సాయంతో మాట్లాడే పరికరం) ద్వారా తన భావాలను పంచుకునేవారు.

హాకింగ్ ప్రధానంగా విశ్వం పుట్టుక, నల్ల బిలాలు, సాపేక్ష సిద్ధాంతంపై పరిశోధనలు చేశారు. హాకింగ్ రేడియేషన్ బ్లాక్ హోల్స్ నుండి కూడా వికిరణం వెలువడుతుందని ఆయన నిరూపించారు. దీనినే 'హాకింగ్ రేడియేషన్' అంటారు. విశ్వం ఒక బిందువు నుండి ప్రారంభమైందని గణితశాస్త్ర పరంగా నిరూపించారు. సామాన్యులకు కూడా సైన్స్ అర్థం కావాలనే ఉద్దేశంతో ఆయన అనేక పుస్తకాలు రాశారు. మార్చి 14, 2018న (ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ పుట్టినరోజున) హాకింగ్ తన 76వ ఏట కన్నుమూశారు.

# ఉపసభాపతి రఘురామకృష్ణరాజుకు గాయం

### ఎమ్మెల్యే పార్థసారథికి పాదం, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు కాలర్ బోన్ ఫ్రాక్చర్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 26 :** ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో పలువురు చాలా ప్రొఫెషనల్‌గా ఆడుతూ ప్రతిభ చాటుతున్నారు. ఈ క్రమంలో ముగ్గురు సభ్యులు గాయాల పాలయ్యారు కూడా. బుధవారం క్రికెట్ ఆడిన ఉపసభాపతి రఘురామకృష్ణరాజు.. రనౌట్ నుంచి తప్పించుకునేందుకు క్రీజులోకి వేగంగా పరుగెత్తే ప్రయత్నంలో అదుపుతప్పి కింద పడిపోయారు. శరీర భారమంతా ఎడమ భుజంపై పడింది. కిందపడే సమయంలో అర చేతిని నేలకు ఆనించడంతో మణికట్టు వద్ద గాయాలయ్యాయి. వెంటనే ఫిజియో వైద్యుడు పరీక్షించి, పట్టీ వేశారు. తర్వాత ఆయన మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించుకున్నారు. భుజానికి నొప్పి ఉండటంతో పాటు చేతి బొటన వేలికి గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం ఆయన గురువారం హైదరాబాద్ వెళ్లనున్నారు.

**కబడ్డీలోనూ..:** ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఓ ఎమ్మెల్యే, మరో ఎమ్మెల్సీ గాయపడ్డారు. తమ జట్టుపై కూతకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి, ఇంకోసారి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను పట్టుకునే ప్రయత్నంలో ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వారిపై పడ్డారు. పార్థసారథికి పాదం భాగంలో, శ్రీకాంత్‌కు భుజం వద్ద కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయ్యాయి. వీరి గాయాలను బుధవారం పరీక్షల్లో గుర్తించారు. బుధవారం చేతికి కట్టుతో మైదానానికి వచ్చిన శ్రీకాంత్.. సహచరులను ఉత్సాహపరిచారు.



క్రికెట్ రన్ తీస్తూ కింద పడిపోతున్న రఘురామ

# న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది

### NCERT వివాదాస్పద బుక్‌ను నిషేధించిన సుప్రీం

**న్యూఢిల్లీ :** జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడం వివాదం అవుతోంది. ఈ అంశాన్ని సుమోటోగా పరిగణించిన సుప్రీంకోర్టు.. గురువారం విచారణను ప్రారంభించింది. ఇది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంలో బాధ్యులకు శిక్ష పడాలని సీజేఐ తీవ్రంగా స్పందించారు. ఈ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానానికి కేంద్రం బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారాన్ని తాము సమర్థించుకోవడం లేదని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు.

ఈ విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "వాళ్లు ప్రయోగించిన బుల్లెట్‌తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా ఇలాగే వదిలేస్తే.. ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది" అని ఆందోళన వ్యక్తంచేశారు. "అలాగే న్యాయవ్యవస్థ పాత్ర వివరించేందుకు ఒక పూర్తి అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ కేటాయించింది. కానీ కోర్టుల విశిష్ట చరిత్రను మాత్రం వదిలేసింది. జవాబుదారీతనం ఏర్పడేవరకు ఈ వ్యవహారాన్ని మేం వదిలివేయబోం. దీనికి వెనక ఎవరు ఉన్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం" అని వ్యాఖ్యానించారు.

అలాగే ఎన్‌సీఈఆర్‌టీ వివాదాస్పద పుస్తకంపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని ఉల్లంఘిస్తే.. కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఆ సంస్థ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా తుషార్ మెహతా స్పందిస్తూ.. న్యాయవ్యవస్థకు తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. పబ్లిక్ నోటీసు ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్తామని కోర్టుకు తెలియజేశారు. తదుపరి విచారణ మార్చి 11న జరగనుంది.

**ఇదీ జరిగింది..**

పుస్తకంలో న్యాయవ్యవస్థపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం దానిపై స్పందించిన సీజేఐ.."న్యాయవ్యవస్థకు కళంకం ఆపాదించేలా ఎవరు ప్రవర్తించినా అనుమతించను" అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించిన పాఠ్యాంశంతో కూడుకున్న పుస్తక పంపిణీని నిలిపివేయాల్సిందిగా ఎన్‌సీఈఆర్‌టీని కేంద్ర విద్యాశాఖ ఇప్పటికే ఆదేశించింది. అసంబద్ధమైన విషయాలు పాఠ్యాంశంలో వచ్చాయని, నిర్ణయం తీసుకోవడంలో పొరపాటు వల్ల ఇలా జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.

## సిట్ ఎదుట లొంగిపోయిన అవినాష్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల అవినాష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. వెంటనే దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించడానికి నిరాకరించింది. ఈ నేపథ్యంలో అవినాష్‌రెడ్డి నేడు సిట్ ఎదుట లొంగిపోయారు.

## కార్నీ భారత్ పర్యటన వేళ

(మొదటి పేజీ తరువాయి)

పేరును చేరుస్తూ కెనడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో రెండు దేశాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అయితే ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ఇతర దేశాల ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడం భారత్ విధానం కాదని తేల్చి చెప్పింది. అది జరిగిన కొన్ని రోజులకే ట్రూడో ఎత్తులకు షాక్ తగిలింది. కెనడా రాజకీయాల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని దర్యాప్తులో తేటతెల్లమైంది. 2021 నాటి ఎన్నికలను ప్రభావితం చేసేలా న్యూదిల్లీ ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి రాలేదని కెనడాలో ఎన్నికలను పర్యవేక్షించిన ఓ సీనియర్ అధికారి కమిషన్‌కు వెల్లడించారు.

ఇప్పుడు ఆ ఎన్నికల జోక్యం అంశం పైనే కార్నీ ప్రభుత్వం స్పందించింది. తమ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భారత్ జోక్యాన్ని తాము విశ్వసించడం లేదని కెనడా అధికారి వెల్లడించారు. అదే విశ్వసిస్తే తమ ప్రధాని భారత పర్యటనకు వెళ్లే అవకాశమే లేదన్నారు. "ఈ అంశాలపై మేం భారత ప్రభుత్వంతో సమగ్ర చర్చలు జరిపాం. విదేశీ జోక్యాన్ని నివారించేలా మా వద్ద మెరుగైన భద్రతా చర్యలు ఉన్నాయి" అని సదరు అధికారి మీడియాతో మాట్లాడారు.

## రాయలసీమకు నిజమైన ద్రోహి జగనే

(మొదటి పేజీ తరువాయి)

కాసేపు వాయిదా వేశారు. అనంతరం మళ్లీ సభ ప్రారంభయ్యాక గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుపై ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి సమాధానానికి వైకాపా సభ్యులు పట్టుబట్టారు. ఈక్రమంలో బొత్స సత్యనారాయణ, మంత్రుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 2020లో ఎన్జీటీకి వెళ్లి రాయలసీమ ఎత్తిపోతలను తామే ఆపామని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారని మంత్రి నిమ్మల అన్నారు. అప్పటి సీఎం జగన్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ మాట్లాడటంతో ప్రాజెక్టు ఆగిందని హరీశ్‌రావు స్పష్టం చేసిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు.

మంత్రి సమాధానంపై బొత్స అసంతృప్తి వ్యక్తంచేయగా.. మంత్రి పయ్యావుల ఘాటుగా స్పందించారు. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైకాపా ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆ ప్రాజెక్టును ఆపి తప్పు చేసిందెవరో ఆ పార్టీ సభ్యులు తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను వైకాపా ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. సభలో గందరగోళం చెలరేగడంతో మండలి ఛైర్మన్ సభను కాసేపు వాయిదా

## ముద్రగడ మ్యాజిక్ పనిచేయడం లేదా ?



**అమరావతి :** ముద్రగడ పద్మనాభం. అలియాస్ పద్మనాభరెడ్డి. ఆయన వైసీపీలో కీలక నాయకుడిగా ప్రస్తుతం ఉన్నారు. ఆయన 2024 ఎన్నికల ముందు ఒక భీకరమైన శపథం చేశారు. తాను జనసేన అధినేత పవన్ ని పిఠాపురంలో ఓడిస్తాను అని. ఒకవేళ అది సాధ్యపడకపోతే తన పేరు మార్చుకుంటాను అని. నిజానికి ఈ సవాల్ ఆయన తానుగా చేశారు, ఎవరూ చేయమనలేదు, ఆవేశంతో చేసిన ఈ సవాల్ ని ఆ తరువాత ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు కూడా. కానీ ముద్రగడ మాత్రం పట్టుదలగా తన పేరుని మార్చేసుకున్నారు.

**అదే బూమరాంగ్ :** ముద్రగడకు అదే బూమరాంగ్ అయింది అని అంటున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనం స్పష్టంగా ఉంది. పైగా పవన్ కళ్యాణ్ ని గెలిపించాలని పిఠాపురం జనాలు డిసైడ్ అయ్యారు. ఇవన్నీ రాజకీయంగా విశేష అనుభవం కలిగిన ముద్రగడకు తెలియవా అన్నది పెద్ద ప్రశ్న. ఇక ఆయన తొలుత జనసేనలో చేరాలని అనుకున్నారని ఆ తరువాత అడుగులు వైసీపీ వైపు పడ్డాయని మరో ప్రచారం సాగింది. ఇక వైసీపీలో ఉంటూ ముద్రగడ పవన్ మీదనే రాజకీయ యుద్ధం ప్రకటించడం కాపు సామాజిక వర్గానికి నచ్చలేదని అంటారు. దాంతో నాటి నుంచే ముద్రగడ పట్ల కాపులు కొంత ఎడం పాటిస్తున్నారు అని అంటున్నారు.

**ఏమి మాట్లాడినా :** ఇదిలా ఉంటే ముద్రగడ కాపుల గురించి ఏమి మాట్లాడినా గతంలో ఆయనకు మద్దతు ఉండేది. కానీ ఇపుడు మాత్రం ఆయన మాటలు చేస్తున్న ప్రకటనలు అన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చేస్తున్నది కూడా ఒక బలమైన సామాజిక వర్గంగా ఉన్న కాపులే అని అంటున్నారు. తాజాగా ముద్రగడ అంబటి రాంబాబుని పరామర్శించడానికి ఇంటికి వెళ్ళారు. ఆ తరువాత మీడియాతో మాట్లాడుతూ ఆయన కాపుల మీద టీడీపీ దాడులు అదే పనిగా చేస్తోంది అని విమర్శించారు. ఎపుడు అధికారంలోకి టీడీపీ వచ్చినా కూడా ఇదే విధంగా చేస్తున్నారు అని 2016లో తనను 2026లో అంబటి రాంబాబుని ఇలా దాడులు చేసి కుటుంబాల మీదకు వచ్చారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

**వైసీపీ నేతగానే :** సహజంగా ముద్రగడ మాట్లాడితే కాపు సామాజిక వర్గం నుంచి పెద్ద ఎత్తున సానుకూల స్పందన రావాలి. కానీ ఆయన కామెంట్స్ ని సొంత వారే వైరల్ చేసి ట్రోల్ చేస్తున్నారు. దానికి కారణం పెద్దాయనగా ఉన్న ముద్రగడ నిలకడ లేని రాజకీయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇక ఆయన పేరుని పద్మనాభరెడ్డి అని మార్చుకోవడం కూడా ఎవరికీ అసలు నచ్చడం లేదుట. దాంతో వైసీపీ నేతగానే ముద్రగడను చూస్తున్నారు తప్ప కాపుల కోసం ఉద్యమించిన గత ముద్రగడగా భావించడం లేదుట. దాంతో పెద్దాయన మ్యాజిక్ గోదావరి జిల్లాలో పెద్దగా పనిచేయడం లేదని అంటున్నారు. మరి ముద్రగడ ఈ విషయాల మీద విశ్లేషణ చేసుకుని బలమైన సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేలా తిరిగి తన వ్యూహాలను అమలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

# ప్రభుత్వ భూమికి ఎసరు



ఉంది)ని కొందరు చదును చేస్తున్నారు. నాలుగైదు దశాబ్దాల క్రితం డీపట్టాలు పొందిన రైతుల వారసుల నుంచి తాము భూమి కొనుగోలు చేశామని చెప్పుకుంటున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.300 కోట్ల ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డపాలెం సర్వే నంబరు 292లో నాలుగైదు దశాబ్దాల క్రితం దారసి అప్పారావురెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు 10.62 ఎకరాలకు డీపట్టాలు ఇచ్చారు. అయితే ఆ భూములను దాసరి అప్పారావు వారసులు 2004 తరువాత 2.62 ఎకరాలు, నాలుగు ఎకరాలు, నాలుగు ఎకరాలు వంతున ముగ్గురికి విక్రయించి రిజిస్టర్ చేశారు. అయితే డీపట్టా భూముల క్రయవిక్రయాలు చెల్లవు. డీపట్టా పొందిన వ్యక్తులు లేదా వారి వారసులు వ్యవసాయం లేదా తోటలు పెంచుకుని జీవనం సాగించాల్సి ఉంటుంది. డీపట్టా భూములు చేతులు మారాయనే విషయం తెలియడంతో 2007లో అప్పటి ఆనందపురం తహశీల్దారుకు మొత్తం 10.62 ఎకరాలు ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. దీనిపై భూమి కొనుగోలు చేసిన వ్యక్తి ఒకరు కోర్టులో కేసు వేశారు. ఆ తరువాత 2014, 2021లో భూమిలో ప్రవేశించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో 10.62 ఎకరాలను నిషేధిత భూముల జాబితా 22(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఈ భూములు 22(ఎ)లోనే ఉన్నాయి. అయితే భూములు కొనుగోలు చేసిన వారిలో ఒకరు వారం క్రితం ప్రొక్లెయినర్లతో రాళ్ల గుట్టలను తవ్వి బయటకు తరలిస్తున్నారు. భూమిని చదును చేస్తున్నారు. రాళ్ల గుట్టలను తవ్వి బయటకు తరలించేందుకు గనుల శాఖ, గ్రామ పంచాయతీ అనుమతి లేదు. ప్రస్తుతం 22(ఎ)లో ఉండడంతో అనుమతులు ఇచ్చే అవకాశం లేదు.

ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న విషయం తెలుసుకున్న ఆనందపురం మండల తహశీల్దార్ శీనుబాబు వెంటనే సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. ఈ విషయమై తహశీల్దార్ మాట్లాడుతూ సర్వేనంబరు 292లో ఉన్న 10.62 ఎకరాలు ప్రభుత్వ భూమి అని స్పష్టంచేశారు. దీనిపై కొందరు కోర్టులో వేసిన కేసులు విచారణలో ఉన్నాయన్నారు. డీపట్టా భూములు అనుమతులు తీసుకోకుండా విక్రయించరాదని, గతంలో చేసిన అమ్మకాలు చెల్లవన్నారు.

**పట్టాదారు పాస్ పుస్తకాల జారీకి తిరస్కృతి:** బొడ్డపాలెంలో డీపట్టాభూములు కొనుగోలుచేసిన వ్యక్తులు గతంలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేయగా ఆనందపురం తహశీల్దారు తిరస్కరించారు. దాంతో విశాఖ ఆర్డీవో కోర్టులో కేసు దాఖలుచేశారు. డీపట్టా భూముల కొనుగోలు చెల్లదని పేర్కొంటూ ఆర్డీవో సదరు కేసును కొట్టివేశారు. దీనిపై కొనుగోలుదారులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆర్డీవో వద్దే సమస్య పరిష్కరించుకోవాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం భీమిలి ఆర్డీవో వద్ద కేసు పెండింగ్‌లో ఉంది. విచారణ చేస్తున్నాం. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆనందపురం మండలం వెల్లంకి రెవెన్యూ పరిధి బొడ్డపాలెంలో సర్వే నంబర్ 292లో భూములను క్లెయిమ్ చేసుకుంటున్న వ్యక్తులకు సంబంధిత డాక్యుమెంట్లు తీసుకుని గురువారం రావాలని సూచించాం.

వారి వివరాలు సేకరిస్తున్నాము. తప్పుడు ఆధారాలతో ఉన్న భూమిలో ప్రవేశించిన వ్యక్తులపై కేసు నమోదుచేస్తాం

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ప్రకటన నం. eT-HQ-WAT-09-2026
తేది.19.02.2026

**పని పేరు:**
అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్/ఎస్టేట్/ వాల్తేరు అధికార పరిధి క్రింద విశాఖపట్నం సెటిల్‌మెంట్‌లో ప్లాంట్ నర్సరీ అభివృద్ధి.

**పని సుమారు వ్యయం**
రూ.50,27,233.45, బయానా: రూ.1,00,600.00 పనిపూర్తి చేయుకాలం :06 (ఆరు) నెలలు.

**టెండరు ముగింపు తేది మరియు సమయం:**
17.03.2026న 15.00గం.లకు

సంస్థ లెటర్ హెడ్‌పై దాఖలు చేయబడినప్పటికీ, సకాలంలో అందినప్పటికీ కూడా సదరు టెండర్లపై తపాలా/కొరియర్/ఫ్యాక్స్ లేదా స్వయంగా ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు చెల్లనివిగా పరిగణించబడును మరియు ఎటువంటి పరిశీలన లేకుండా తిరస్కరించబడును. పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ www.ireps.gov.in లో లభిస్తుంది.

గమనిక: కాగోరు టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినట్టి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 15 (పదిహేను) రోజులు వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg.)/ వాల్తేరు
PR-1166/Q/25-26

**ఈస్ట్‌కోస్ట్ రైల్వే**

ప్రకటన నం. eT-SrDME-WAT-331-2026

**పని పేరు**
ఒక సంవత్సర కాలానికి విశాఖపట్నం కోచింగ్ డిపో యొక్క LHB కోచ్‌లలో ఏర్పాటు చేయబడిన క్లోజ్డ్-సర్క్యూట్ సర్వెలైన్స్ సిస్టమ్స్ (సిసిటివి) యొక్క వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ యొక్క పని ఔట్‌సోర్సింగ్.

**సుమారు పని వ్యయం:**
రూ. 1,28,86,636.30, బయానా: రూ. 2,14,400.00, టెండరు డాక్యుమెంట్ ధర: రూ. 5,900/- పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు

**టెండరు ముగింపు తేది & సమయం**
16.03.2026న 1500 గం.లకు.

సంస్థ లెటర్ హెడ్‌పై దాఖలు చేయబడినప్పటికీ, సకాలంలో అందినప్పటికీ కూడా సదరు టెండర్లపై తపాలా/కొరియర్/ఫ్యాక్స్ లేదా స్వయంగా ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు చెల్లనివిగా పరిగణించబడును మరియు ఎటువంటి పరిశీలన లేకుండా తిరస్కరించబడును. పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ http://www.ireps.gov.in లో లభిస్తుంది.

గమనిక: కాగోరు టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినట్టి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 10 (పది) రోజులు వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్, వాల్తేరు
PR-1163/Q/25-26

# చేపల వేటకు కొత్త నిబంధనలు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** కేంద్ర మత్స్యశాఖ కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. వాటిని మత్స్యకారులంతా తప్పనిసరిగా పాటించాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి చిక్కుల్లో పడొద్దని హెచ్చరిస్తున్నారు.మూడు రకాలుగా కేంద్ర మత్స్యశాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం... తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల వరకు ప్రాంతీయ జలాలు. 12 నుంచి 200 నాటికల్ మైళ్ల వరకు ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ (ఈఈజడ్) జలాలు. 200 నాటికల్ మైళ్లు దాటితే 'హైసీ ప్రాంతం'గా వర్గీకరించారు. ప్రాంతీయ జలాలు దాటి వేట సాగించే మర పడవలు, ఇంజిన్ బోటు ఆపరేటర్లకు యాక్సెస్ పాసులు జారీ చేస్తున్నారు. నడి సంద్రంలో వేట సాగించే సమయంలో నౌకాదళం, కోస్టుగార్డు, మెరైన్ పోలీసు విభాగం అధికారులు ఎవరైనా తనిఖీలు చేస్తే ఆయా పాసులు చూపించాల్సి ఉంటుంది.ఇదీ పరిస్థితి విశాఖ చేపలరేవు కేంద్రంగా 680 మర పడవలు, మరో 300 ఇంజిన్ బోట్లు వేట సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఇంజిన్ బోట్లు తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల లోపు మాత్రమే వేట సాగించడానికి అనుమతి ఉంది. మర పడవలు మాత్రం 12 నాటికల్ మైళ్లు దాటి వేట సాగించే వీలుంటుంది.

# ఓటరు జాబితాల తయారీలో యంత్రాంగం



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** పాయకరావుపేట, పల్లెలకు ఎన్నికల శోభ రానుంది. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనుంది. ఎన్నికల నగారా మోగేలోగా ఓటర్ల జాబితాలను అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది. మండల పరిషత్తు కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది జాబితాల తయారీలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఈ నెల 2వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్లో ఉంచిన ఓటరు జాబితా వివరాలను సిబ్బందికి ఈ నెల 20న అందించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ తాజా ఓటరు జాబితాలను కలెక్టరేట్ నుంచి మండలాలకు పంపించారు. వీటిలో సవరణలు, తప్పులు, ఒకే కుటుంబంలోని అందరి ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చూస్తున్నారు. ఇంటి నంబర్ల ఆధారంగా జత చేస్తున్నారు. ఈ వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు.

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్లు ఉండగా కొత్తగా అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటైన విషయం తెలిసిందే. రెవెన్యూ డివిజన్, పంచాయతీ పేరు, మండలం, జిల్లా కోడ్, వార్డులు, అసెంబ్లీ నియోజకవర్గం ఆధారంగా వివరాలు తీసుకుంటున్నారు. పాత పంచాయతీల ముఖచిత్రం మేరకు పోలింగ్ కేంద్రం నంబరు, పంచాయతీలో శివారు గ్రామాల వివరాలు నమోదు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితాలను సమగ్రంగా పరిశీలన చేయిస్తున్నాం. గ్రామాల వారీగా అన్ని వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. మార్చి మొదటి వారానికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ పేర్కొన్నారు.

పేట నుంచి అంకంపేట, రాజానగరం, రాజయ్యపేట, నక్కపల్లి మండలంలో బోయపాడు, దొండవాక, ఒడ్డిమెట్ట, గొడిచెర్ల, డొంకాడ కొత్తూరు, ఎస్.రాయవరం మండలంలో బంగారమ్మపాలెం, సోముదేవుపల్లి, కోటవురట్ల మండలంలో తంగేడును కొత్త పంచాయతీలుగా ఏర్పాటుకు ప్రతిపాదనలు అధికారుల పరిశీలనలో ఉన్నాయి. 9 లోగా జాబితాలు సిద్ధం

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ముందుగానే నికర ఓటర్ల జాబితాల తయారీలో యంత్రాంగం తలమునకలైంది. మార్చి 9లోగా జాబితాలను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి అందజేయనుంది. ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల కాగా.. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు జాబితాలపై కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 646 పంచాయతీలున్నాయి. వీటిలో 48 మేజర్ పంచాయతీలు. వీటి పరిధిలో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఓటర్ల వివరాలతో తుది జాబితా సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నాటికి 12,98,777 ఓటర్లు ఉన్నారు. ఈ క్రమంలో అధికారులు, ఉద్యోగులు 2024 సాధారణ ఎన్నికలకు సిద్ధం చేసిన తుది జాబితాను, 2026 జనవరికి ఉన్న ఓటర్ల జాబితాతో పోల్చి చూస్తున్నారు. జాబితాలను ఎంపీడీఓలు, ఈవోఆర్డీల పర్యవేక్షణలో గడువులోగా పరిశీలన పూర్తి చేయనున్నారు. ఓటర్లలో ఎవరైనా మరణించినట్లు ధ్రువీకరణ అయితే ఓటరు నంబరు వద్ద జాబితాలో రెడ్ మార్కు చేస్తున్నారు. కొత్త ఓటర్లు నమోదైతే జాబితాలో ఎప్పటికప్పుడు అనుసంధానంగా సీరియల్ నంబరుతో నమోదు చేస్తున్నారు. ఈ వివరాలను ఉప ఎంపీడీఓలకు ఇచ్చిన లాగిన్ ద్వారా ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇవి నేరుగా డీపీఓ లాగిన్‌కు చేరుతున్నాయి

# పాల నాణ్యత తనిఖీ చేస్తున్న అధికారులు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఎలమంచిలి, పాడేరు, ఉదయం నిద్ర లేవగానే బెడ్ కాఫీ తాగనిదే దినచర్య ప్రారంభించని వారెందరో. ఫ్రిజ్‌లో పాల గిన్నె తీసి చల్లదనం పోకుండానే గ్యాస్ స్టవ్ వెలిగిస్తాం. బాగా మరిగించి కాఫీ కలుపుకొంటాం. రుచిగా లేకున్నా వేడిగా ఉండటంతో తాగేస్తాం. పసి పిల్లలుంటే ఆ పాలే డబ్బాలో పోసి పడతాం. పాఠశాలలకు వెళ్లే చిన్నారులకూ అవే ఇస్తాం. ఉరుకుల పరుగుల జీవితంలో పాల నాణ్యత గురించి పట్టించుకునే తీరిక ఎవరికీ లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని పాల వ్యాపారులు కల్తీకి పాల్పడుతున్నారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా.. వారు దుకాణాలు, హోటళ్లలో తనిఖీలకే పరిమితం అవుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి మరణాలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికార, అనధికార డెయిరీలను తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఒక్క రాజమహేంద్రవరంలోనే కాదు.. అంతటా కల్తీ పాల విక్రయాలు జరుగుతున్నాయి. కొందరు పాలల్లో నీళ్లు కలిపితే.. మరికొందరు మైదా పిండి, గంజి కలుపుతున్నారు. తాజా పాలు అన్నది నేతిబీర చందమే అన్నట్లుగా ఉంది. జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో చాలా మంది డెయిరీలకు పాలు పోస్తున్నారు. కొందరు గ్రామాల్లో దుకాణం పెట్టుకుని పాలు విక్రయించే వారికి పోస్తున్నారు. మరికొందరు ప్రతి రోజూ ఇంటింటికి వెళ్లి పాలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. అనకాపల్లి జిల్లాలో ఉత్పత్తి అయ్యే 8.98 లక్షల లీటర్ల పాలలో 6.73 లక్షల లీటర్లు డెయిరీలకు సరఫరా అవుతుండగా.. 2.25 లక్షల లీటర్లు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరిగి పోస్తున్నారు. పేరున్న డెయిరీలకు సరఫరా చేసే పాలతో ఇబ్బంది లేదు. ఇళ్లకు వచ్చే వ్యాపారులు పాలను నిల్వ చేసేందుకు శాస్త్రీయ, అధునాతన పద్ధతులను అవలంబించడం లేదు. రైతుల నుంచి సేకరించే పాలు రెండు రోజులపాటు నిల్వ ఉండేందుకు వంట సోడా, రసాయనాలు వాడుతున్నారు. పాలల్లో నీళ్లు కలిపినా చిక్కగా ఉండలా, పెరుగు గడ్డగా ఉండేందుకు మైదా పిండి, గంజి, వరి పిండి కలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తాం జిల్లాలోని అన్ని పాల సేకరణ కేంద్రాల్లో పాల నాణ్యతపై తనిఖీలు చేయాలని పశువైద్యాధికారులను ఆదేశించాం. ఎవరైనా కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతాం.

# భారీ ఆర్డర్ దక్కించుకున్న షిప్‌యార్డ్



**అనకాపల్లి, విశాఖసమాచారం:** సింధియా: జాతీయ స్థాయిలో పలు సంస్థల నుంచి ఎదురైన పోటీని తట్టుకొని హిందుస్థాన్ షిప్‌యార్డు తక్కువ బిడ్‌తో భారీ ఆర్డరుని దక్కించుకుంది. ఇటీవల సంస్థ రూ.3వేల కోట్ల విలువైన ఫాస్ట్ పెట్రోల్ వెసల్స్ (ఎఫ్‌పీవీ) ఆర్డరుని చేజిక్కించుకుంది. ఈ ఎఫ్‌పీవీ ఆర్డర్లను పూర్తిస్థాయిలో విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డులోనే నిర్మించాలని సంస్థ కార్మిక సంఘాలు, ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి. రూ. 3 కోట్ల నిధులతో..: భారతీయ తీరగస్తీదళ అవసరాల నిమిత్తం భావితర వేగవంత గస్తీ నౌకల (ఎఫ్‌పీవీ) నిర్మాణానికి ఇండియన్ నేవీ పావులు కదిపింది. ఏక కాల షెడ్యూలులోనే ఏకంగా 18 ఎఫ్‌పీవీలను నిర్మించాలని రక్షణ ఉత్పత్తుల విభాగానికి సిఫారసు చేసింది. వీటి నిర్మాణానికి రూ.3వేల కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో జాతీయ స్థాయిలో టెండర్లకు ఆహ్వానించగా ఆరు కంపెనీలు ఈ టెండర్ల ప్రక్రియలో పాల్గొన్నాయి. అయితే ఈ ఆర్డరు హిందుస్థాన్ షిప్‌యార్డు వశమైంది. పూర్తిచేయాలి ఇలా హిందుస్థాన్ షిప్‌యార్డులో ఈ 18 ఎఫ్‌పీవీల నిర్మాణానికి త్వరలో ఎంవోయూలు ఖరారు కావాల్సి ఉంది. అయితే ఈ నౌకల్లో తొలి వెసల్‌ను 30 నెలల కాల వ్యవధిలో పూర్తిచేయాల్సి ఉంటుంది. అక్కడ నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒక్కో నౌకా నిర్మాణం పూర్తిచేయాలి. దేశరక్షణకు దేశానికి కేంద్రపాలిత ప్రాంతాలతో సహా విస్తారమైన సముద్ర తీరం ఉంది. భవిష్యత్తులో సంక్లిష్ట ఆస్తుల పరిరక్షణ, సముద్ర స్మగ్లింగ్ నియంత్రణకు ఈ భావితర తీరగస్తీని వేగవంతంగా జరిపేందుకు దోహదపడేలా ఈ నౌకలను రూపొందించనున్నారు. బీ అయితే గతంలో ఆర్డర్లు సాధించినా.. తరువాత బయట ప్రైవేట్ షిప్‌యార్డులకు తరలించారు. ఈసారి అలా కాకుండా అన్నింటిని హిందుస్థాన్ షిప్‌యార్డులోనే పూర్తిచేయాలని కార్మిక వర్గాలు కోరుకుంటున్నాయి.

# నగరంలో డ్రగ్స్ ముఠాలు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖ నగరంలో చాపకింద నీరులా డ్రగ్స్ అమ్మకాలు సాగుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, గోవా నుంచి గుట్టుచప్పుడు కాకుండా తెచ్చి యువతకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 22న పెందుర్తి పరిధిలోని సుజాతనగర్‌లో నలుగురు యువకుల వద్ద 4 గ్రాముల ఎండీఎంఏ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. తాహీర్ అనే యువకుడు బెంగళూరులో డ్రగ్స్ కొనుగోలు చేసి విశాఖలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతేడాది డిసెంబరులో ఆర్‌పీఎఫ్ (రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్), ఎన్‌సీబీ (నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో) ఆపరేషన్ చేపట్టగా...కేరళ తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని 4లీటర్ల హ్యాష్ ఆయిల్‌ను దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. గతేడాది నవంబరులో వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి, మరో ఇద్దరి నుంచి 48 ఎల్‌ఎస్‌డీ స్ట్రిప్స్ ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. బీ గతేడాది నవంబరు 27న దిల్లీ, గ్వాలియర్, విశాఖలోని 20 ప్రాంతాల్లో ఈగల్, దిల్లీ క్రైం బ్రాంచి పోలీసులు తనిఖీలు చేపట్టారు. విశాఖలో డ్రగ్స్ సరఫరాలో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురు నైజీరియా మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఉచితమంటూ యువతను డ్రగ్స్‌కు బానిసలుగా చేసేందుకు కొన్ని ముఠాలు ప్రయత్నిస్తున్నాయి. వేడుకల్లో 'ఒక్కసారి ట్రై చేయి ఏమీ కాదు' అంటూ ఉచితంగా ఇస్తారు. అలవాటు పడ్డాక అధిక ధరలకు అమ్ముతారు. 'ఒత్తిడి తగ్గుతుంది, ఫోకస్ పెరుగుతుంది' అంటూ కళాశాలల్లో అలవాటు చేస్తున్నట్లు సమాచారం. సిగరెట్లలో గంజాయి, సింథటిక్ డ్రగ్స్ కూరి తాగేలా చేస్తారు. సామాజిక మాధ్యమాల్లో కొన్ని ప్రత్యేక 'కోడ్'లు పెట్టి అమ్మకాలు చేస్తున్నారు. పబ్‌లు, రెస్టోబార్‌లు, బీచ్ రోడ్డులో కొన్ని ప్రాంతాల్లో యువతను లక్ష్యంగా చేసుకొని అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# అనుమానంతో భార్య ఉసురు తీశాడు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాలాక్షినగర్, అనుమానంతో భార్యను హత్య చేసిన భర్తను ఆరిలోవ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ద్వారకాజోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బురదపాటి దేముడు, భార్య దుర్గ (33) ఇద్దరు పిల్లలతో ఆరిలోవ బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా భార్య దుర్గపై అనుమానం పెంచుకున్న దేముడు ఆమెతో నిత్యం ఘర్షణ పడేవాడు. మాట్లాడిన తర్వాత ఫోన్‌లో పేర్లను డిలీట్ చేయడం, వాట్సప్ చాటింగ్ తొలగించటంపై మంగళవారం ఉదయం దేముడు భార్యతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఆగ్రహంతో దుర్గ మెడకు చున్నీ గట్టిగా బిగించడంతో ప్రాణాలు కోల్పోయింది. కొంత సమయం తర్వాత తల్లిదండ్రులు వచ్చి పిలవగా దుర్గ స్పందించకపోవడంతో తలుపులు పగులగొట్టి చూశారు. అచేతనంగా పడి ఉన్న ఆమె మెడ కమిలిపోయి ఉండడం చూసి ఆత్మహత్యగా భావించి విమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు వచ్చి ఇల్లంతా పరిశీలించగా ఫ్రిజ్ వెనుక దేముడు దాక్కుని ఉండటం చూసి అదుపులోకి తీసుకుని విచారించారు. తనపై భార్య దాడికి దిగడంతో తట్టుకోలేక మెడకు చున్నీ బిగించి చంపినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు వచ్చి ఇల్లంతా పరిశీలించగా ఫ్రిజ్ వెనుక దేముడు దాక్కుని ఉండటం చూసి అదుపులోకి తీసుకుని విచారించారు. తనపై భార్య దాడికి దిగడంతో తట్టుకోలేక మెడకు చున్నీ బిగించి చంపినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# శిధిలావస్థకు చేరుకున్న ఐ టి డి ఏ రెంటల్ హౌసింగ్ కాలనీ





**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం. మండల కేంద్రంలో కథ 40 ఏళ్లుగా శిధిలాస్తులు చేరుకున్న ఐటిడిఏ రెంటల్ హౌసింగ్ కాలనీ స్థానిక నుండి ప్రభుత్వ ఉద్యోగ విధులు నిర్వహించేందుకు సరైన వసతి గృహము లేక ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు తీవ్ర అవస్థలు పడుకున్నారు మండల కేంద్రంలో స్థానికంగా నివసించాలంటే సరైన వసతులు లేక కుటుంబములతో నివాసములు ఉండి సమయానుకూరానికి ఉద్యోగ విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ ఆయా శాఖల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని గురు వారం నాడు స్థానిక విలేకరుల ముందు వాపోయారు ఆయా శాఖల ఉద్యోగుల బాధ్య తులపై ఆయా శాఖలలో విధులు నిర్వహించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నమని అందుకు నాన్ షెడ్యూల్ ఏరియా మైదా నా ప్రాంతాలైన పట్టణ ప్రాంతాల నుండి ఎస్.కోట. విజయనగరం జామి. గంట్యాడ. కొట్టం. అలమండ. బొద్దాం. కొత్తవలస. పెందుర్తి. అనకాపల్లి. జామీ. భీమిలి. పోతన మల్లయ్య పాలెం. దొర తోట. మద్దిలపాలెం. ఇసుకతోట. కంచరపాలెం.గాజువాక.అనకాపల్లి. సబ్బవరం.ప్రాంత ల నుండి రాకపోకలు చేసి ఉద్యోగ బాధ్యతలు చేస్తున్నమని వాపోయారు సమయా అనుకూలానికి విధులకు శారకపోతే మండలంలోని మారుమూల ప్రాంతాల నుండి పనుల నిమిత్తమై గిరిజనులు ఆయా శాఖ ల ప్రభుత్వ కార్యాలయానికి వచ్చి అటు అధికారులు ప్రభుత్వ ఉద్యోగాలు రాక ఆలస్యమైతే చూసిచూసి నిరుత్సవం సంధి విసుగు పుట్టి తిరుగు వారి వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్ళిపోతున్నారు ఎన్నోమార్లు అనంతగిరి మండల కేంద్రంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు ఉద్యోగులకు పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి. కలెక్టర్కు పాలకులకు ఎన్నో మార్లు వినతి పత్రాలు అందించమని లేదని పాడేరు కలెక్టర్ వారు. ప్రొజెక్టర్ అధికారి వారు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టి అనంతగిరి మండల కేంద్రంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న మండల స్థాయి అధికారుల కొరకు. ప్రభుత్వ ఉద్యోగుల కొరకు సరైన వసతి గృహములు ఏర్పాటు చేయాలని పాలకులు గిరిజనులు ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు కోరుచున్నారు

# ప్రజా వేదిక గ్రీన్ వెల్‌లో 35 వినతి పత్రాలు స్వీకరణ




**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండల కేంద్రంలో గురువారం నాడు ఎంపీడీవో కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అరకు ఇన్చార్జి మరియు విజయనగరం ఏపీఎస్ ఆర్టీస్ జోనల్ చైర్మన్ అధ్యక్షతనలో నిర్వహించారు మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూటమి నాయకులు కలిసి గ్రామంలో వివిధ పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు ఈ సమస్యలపై తెలుగుదేశం పార్టీ అదృష్టం దృష్టిలో పెట్టి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు అదేవిధంగా మండలంలోని గరుగుబిల్లి పంచాయితీ కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామపంచాయతీ తెలుగుదేశం కార్యకర్తలు ఇంటి సూరిబాబు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు మరి కొంతమంది కార్యకర్తలు కలసి ఎస్ కోట నుండి గరుగుబిల్లి వరకు బసు సౌకర్యము కల్పించాలని గ్రీన్ వెల్ ప్రజా సద సు లో వనికిపత్రం ఇవ్వడం జరిగిందని వారు అన్నారు ఇచ్చిన దరఖాస్తుకు స్పందించి తక్షణమే బస్సు సౌకర్యం కల్పిస్తామని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ అన్నారు ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు. ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర. మండల యూత్ అధ్యక్షుడు డుంబరి శ్యామ్ కుమార్ పాంగి నరేంద్ర పార్లమెంట్ ఉపాధ్యక్షుడు. తెలుగుదేశం పార్టీ మండల్ క్లస్టర్ అధ్యక్షుడు పాంగి సందీప్ ( బాబి ). ఎస్టీ సెల్ అధ్యక్షుడు వంజరపు శంకర్రావు. తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు మాజీ భీమరాజు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిట్టం మురళి. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జి బురదగడ్డ మహేష్. సిహెచ్ పైడిరాజు. మండల్ పార్టీ సీనియర్ నాయకులు పాంగి భీమన్న. జన్ని చిట్టి బాబు. అంగరాయ్య. బి అప్పలస్వామి. మట్టం శ్యామ్. జె వెంకటరావు. సిరికోడి ధర్మ. జన్ని భాస్కర్ రావు. తదితర కార్యకర్తలు పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

విశాఖ సమాచారమ్
శుక్రవారం 27-2-2026

## దేవభూమి ఇక 'కేరళం'

గులాబీ పువ్వును ఏ పేరుతో పిలిస్తేనేం గుబాళింపు మారదు కదా అంటాడు షేక్స్పియర్. కానీ పేరు మీద గుంజాటన అంత సులభంగా పక్కన పెట్టే విషయమేమీ కాదని చరిత్ర రుజువు చేసింది. దేవుడి సొంత గడ్డగా పేరొందిన కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చడం దీనికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నది. సున్నాయేగా మారింది అనుకుంటే సరిపోదు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ మార్పు చోటుచేసుకోవడం వెనుక భాష, చరిత్ర, అస్తిత్వంతో అల్లుకున్న రాజకీయాలున్నాయి. ప్రజల ఆకాంక్ష మేరకు కేరళ శాసనసభ 'కేరళం' తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించగా, వామపక్ష ప్రభుత్వం దానిని కేంద్రానికి పంపింది. ఇది జరిగింది 2024 జూన్ 24న. అంతకుముందు 2023లోనూ ఇలాంటి తీర్మానమే పంపితే అతీగతీ లేకుండా పోయింది. ఇప్పుడు ఏడాదిన్నర తర్వాత కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ హఠాత్తుగా ఈ తీర్మానం దుమ్ము దులిపింది. క్యాబినెట్‌లో పెట్టి మెరుపువేగంతో ఆమోదింపజేసింది. ఇక పార్లమెంటులో రాజ్యాంగ సవరణ జరుగడమే తరువాయి. పేరు మార్పిడి రాజకీయాలకు పెట్టింది పేరైన బీజేపీ ఎన్నికల సమయాన్ని ఇందుకు ఎంచుకోవడం గమనార్హం. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్యనే అధికారం బంతాట సాగే ఈ దక్షిణాది రాష్ట్రంలో కాలు మోపాలని బీజేపీ నానా తంటాలు పడుతున్నది. కేరళ అస్తిత్వంతో ముడివడి ఉన్న అంశంలో సానుకూల స్పందన ద్వారా బయటి పార్టీ అన్న ముద్రను చెరిపేసుకోవాలనేదే బీజేపీ అవకాశవాద తాపత్రయం.

బెంగాల్‌ను తూర్పు, పశ్చిమంగా బ్రిటిష్‌వారు విభజించిన సంగతి తెలిసిందే. దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ఈ విభజన మలుపు తిప్పింది. అయితే రెండు ముక్కలు భారత్‌లో ఉన్నప్పుడు ఈ దిక్కుల తోకలు ఉన్నాయంటే ఏమో అనుకోవచ్చు. కానీ, తూర్పు బెంగాల్ దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌లో లీనమై, ఇప్పుడు బంగ్లాదేశ్‌గా మనుగడ సాగిస్తున్నది. దేశంలో ఒకే రాష్ట్రం మిగిలినప్పుడు ఇంకా పశ్చిమ ఎందుకనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఫైర్ బ్రాండ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తమ రాష్ట్రం పేరును బాంగ్లాగా మార్చాలని చాలాకాలం నుంచి అంటున్నారు. కేరళం ఆమోదం పొందిన నేపథ్యంలో మరోసారి వంగభూమి పేరు మార్పిడిపై చర్చ మొదలైంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ అనేకసార్లు పేరు మార్పిడిపై తీర్మానాలు చేసి కేంద్రానికి పంపింది. వాటిల్లో రాష్ట్రం పేరును పశ్చిమ బంగ లేద బాంగ్లాగా మార్చాలని సూచించారు. చివరి తీర్మానం 2018లో వెళ్లింది. అయినా కేంద్రం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి ఉలుకూ పలుకూ లేదు. కేరళ విషయంలో ఒకలాగా, బెంగాల్ విషయంలో మరోలాగా కేంద్రం అనుసరిస్తున్న రెండు నాల్కల ధోరణికి ఇది నిదర్శనం.

మన దేశంలో అయితే పేర్ల మీద, విగ్రహాల మీద వివాదాలు కోకొల్లలుగా పుట్టుకు వస్తుంటాయి. అందుకు వలసపాలన కొంతవరకు కారణం. బ్రిటష్ పాలన అంతరించాక కూడా ఆ కాలంనాటి విగ్రహాలు ఉంచాలా? ఇంగ్లిష్ భాష కారణంగా అపభ్రంశం పొందిన పేర్లను తిరిగి మనవైన రీతిలో మార్చుకోవాలి కదా? ఈ తరహా ఆలోచనలు ఇటీవలి కాలంలో మరీ ఎక్కువయ్యాయి. మద్రాస్ చెన్నై అయ్యింది. బొంబాయి ముంబైగా మారింది. విక్టోరియా టర్మినస్ (వీటీ).. ఛత్రపతి శివాజీ టర్మినస్ (సీఎస్టీ)గా మారింది. ఈ పేర్ల మార్పిడి అనేది బీజేపీ హయాంలో వెర్రితలలు వేస్తున్నది. ఢిల్లీలో రాజవీధుల పేర్లను ఎడాపెడా మారుస్తూపోయిన బీజేపీ ఈ మధ్య విగ్రహాలపై కూడా పడింది. ఢిల్లీ నగర రూపశిల్పి ఎడ్వర్డ్ ల్యూటెన్స్ విగ్రహాన్ని రాష్ట్రపతి భవన్ ఆవరణలో నుంచి తొలగించి ఆ స్థానంలో భారతీయ ప్రథమ గవర్నర్ జనరల్ రాజాజీ విగ్రహాన్ని పెట్టడం విమర్శల పాలైంది. ల్యూటెన్స్ ఓ ఆర్కిటెక్ట్. ఆయన వైస్రాయి కాదు కదా అని ఆయన మునిమనుమడు ఆవేదన వ్యక్తం చేశారు. అస్తిత్వంతో ముడివడిన సందర్భాల్లో పేరు మార్పిడిని (లేదా విగ్రహాల తొలగింపును) ఆమోదించవచ్చు. కానీ అనవసర వివాదాలతో పేర్లపై రాజకీయం చేయడం దేశానికి ఏ రకంగానూ ఉపయోగకరం కాదు. ఎందుకంటే పేరును మారిస్తే చరిత్ర చెరిగిపోదు.

# కాఫీ.. మరిచిపోనివ్వదు దేన్ని!

కాఫీ.. ఇది కేవలం ఒక పానీయం మాత్రమే కాదు. కోట్లాది మందికి రోజును ఉత్సాహంగా ప్రారంభించే ఒక ఎనర్జీ డ్రింక్. మధ్యాహ్నం వేళ ఆవరించే మగతను వదిలించుకోవాలన్నా, పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలన్నా.. చాలామందికి కాఫీనే మొదటి చాయిస్. అయితే కాఫీ ప్రియులకు ఇప్పుడు సైన్స్ ఒక తీపి కబురు చెప్పింది. రోజూ కాఫీ తాగే అలవాటు ఉన్నవారిలో మతిమరుపు వచ్చే అవకాశాలు తకువగా ఉన్నాయని తాజాగా ఒక పరిశోధనలో తేలింది. ఇది ఏదో ఒకట్రెండు రోజులు చేసిన పరిశోధన కాదు.. ఏకంగా 37 ఏళ్ల పాటు సుమారు 1.3 లక్షల మంది ఆరోగ్య అలవాట్లను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు. వయసు పెరిగే కొద్దీ మెదడు పనితీరు మందగించడం, ఆలోచనా సామర్థ్యం తగ్గడం వంటి న్యూరో డీజెనరేటివ్ సమస్యలను ఎదురోవడంలో కెఫీన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ఈ అధ్యయనంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని వారు వెల్లడించారు. ఈ ప్రయోజనాలన్నీ కేవలం కెఫీన్ ఉన్న కాఫీ లేదా టీ తాగినప్పుడే కనిపిస్తాయి. కెఫీన్ లేని కాఫీ తాగిన వారిలో ఇలాంటి మార్పులేవీ కనిపించలేదు. కాఫీ తాగని వారితో పోలిస్తే, రోజూ పరిమితంగా తాగే వారికి జ్ఞాపకశక్తి సమస్యలు తకువగా ఉన్నాయని, వారు కాగ్నిటివ్ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచారని ఈ నివేదిక వెల్లడించింది. కాఫీ మంచిది కదా అని గంటకో కప్పు తాగేస్తే ప్రయోజనం చేకూరకపోగా, నష్టం వాటిల్లుతుంది.

రోజుకు రెండు మూడు కప్పుల కంటే ఎకువ కాఫీ తాగడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలేమీ ఉండవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీన్ని ఒక మ్యాజిక్ మందులా కాకుండా ఒక ఆరోగ్యకరమైన అలవాటుగా మాత్రమే చూడాలని సూచిస్తున్నారు. మరోవైపు మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం కాఫీ తాగితే సరిపోదు. జీవనశైలిలో మార్పులు కూడా ముఖ్యమే. అందుకోసం



కంటినిండా నిద్ర పోవడం, పోషకాహారం తీసుకోవడంతోపాటు రోజూ వ్యాయామం చేయాల్సిందేనని నిపుణులు సలహా ఇస్తున్నారు.

# సీతమ్మ ను దర్శించిన హనుమ

"నమోస్తు రామాయ సలక్ష్మణాయ, దేవ్యైచ తస్యై జనకాత్మజాయై,।
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో, నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్య:!!

"లక్ష్మణుడితో ఉన్న రాముడికి నమస్కారం, జనకుని కూతురైన సీతమ్మకి నమస్కారం, రుద్రుడికి, ఇంద్రుడికి, యముడికి, వాయుదేవుడికి నమస్కారం, చంద్రుడికి, సూర్యుడికి, దేవతలందరికి నమస్కారం. నాకు సీతమ్మ తల్లి దర్శనం అయ్యేటట్టు దేవతలందరు కటాక్షించెదరుగాక" అని నమస్కారం చేశాడు.

అప్పుడు హనుమంతుడికి ఎదురుగా అశోకవనం కనపడింది. అప్పుడాయన ఒక ధనుస్సు నుండి విడవబడిన బాణంలా ముందుకి వెళ్ళి అశోకవనంలో దిగారు.

హనుమంతుడు అక్కడున్న అన్ని చెట్ల మీదనుంచి అటూ ఇటూ దూకుతూ సీతమ్మని వెతికాడు.

ఆ అశోకవనంలో రావణుడు తన తపఃశక్తితో నిర్మించిన కృత్రిమమైన ఒక కొండ, ఆ కొండ మీదనుంచి ప్రవహిస్తున్న నది ఉన్నాయి.

అలా హనుమ ఆ అశోకవనాన్ని వెతుకుతుండగా ఆయనకి దూరంగా వెయ్యి స్తంభాలతో కూడుకున్న ఒక బ్రహ్మాండమైన ప్రాసాదం కనపడింది.

అది అక్కడున్న సైనికులు విశ్రాంతి తీసుకోవడం కోసం ఏర్పాటు చేసిన మంటపం, దాని మీదకి శింశుపా వృక్షం ఉంది.

అప్పుడాయన ఆ శింశుపా వృక్షం మీదకి దూకి, ఆ చెట్టు కొమ్మల నుంచి కిందకి చూస్తే, చుట్టూ రాక్షస స్త్రీల మధ్యలో ఒక స్త్రీ పట్టుపుట్టం కట్టుకుని ఉంది.

ఆమె సీతమ్మే అయి ఉంటుందని, ఆ ఆకులని పక్కకి తోస్తూ హనుమ చూసేసరికి మట్టి పట్టిన బట్టతో, చుట్టూ అనేకమంది రాక్షస స్త్రీలతో, ఉపవాసాల చేత క్షీణించిపోయి దీనురాలిగా ఉన్న, కన్నులనిండా నీరుతో ఉన్న, నిట్టూర్పులు వదులుతున్న, శుక్ల పక్షంలో వచ్చే మొదటి చంద్రరేఖలా, పొగతో కప్పబడిన అగ్నిజ్వాలలా, నలిగిన పసుపుపచ్చ బట్ట కట్టుకొని, అంగారకుడి చేత పీడింపబడిన రోహిణిలా, పెరిగిన వృద్ధి తగ్గిన,శ్రద్ధని కోల్పోయిన దానిలా, ఆశ నెరవేరని దానిలా, అవమానంతో సిగ్గుపడుతూ ఉన్న సీతమ్మని హనుమ చూశాడు.

అలా ఉన్న సీతమ్మని చూసిన హనుమంతుడి కళ్ళ నుంచి ఆనందబాష్పాలు కారాయి. నల్లటి కళ్ళతో ఉన్న సీతమ్మని చూసిన హనుమకి, ప్రకృతిని చూసినట్లు, ఆ ప్రకృతియందు పురుషుడిని టరాముడినిఊ చూసినట్లు భావించాడు.

"మా రాముడి గుండె చాలా గట్టిది, ఎవ్వరూ చెయ్యలేని పని రాముడు చేశాడని ఇప్పుడు నేను గుర్తించాను. అదేంటంటే, పది నెలలనుంచి ఈ సీతమ్మ రాముడి పేరు చెప్పుకుంటూ, తపస్సు చేసుకుంటూ, రాముడి గురించి శోకిస్తూ ఇక్కడ ఉంటే, అటువంటి భార్యకి దూరంగా ఉండి కూడా 10 నెలలనుంచి ప్రాణాలు నిలబెట్టుకొని ఉన్నాడు. రాముడి మనస్సు సీతమ్మ దగ్గర ఉంది, సీతమ్మ మనస్సు రాముడి దగ్గర ఉంది. అందుకని ఇద్దరూ ఒకరికి ఒకరు దూరంగా ఉండి కూడా ఇంత కాలం బతకగలిగారు.

మూడు లోకాలలో ఉండే ఐశ్వర్యాన్ని తీసుకొచ్చి ఒకపక్క పెట్టి, మరోపక్క సీతమ్మని పెడితే, సీతమ్మ వైభవంలో 16వ వంతు కూడా సరితూగదని తలపోసాడు. నల్లటి జుట్టుతో, ఎర్రటి పెదవితో, సన్నటి నడుంతో, పద్మాలవంటి కన్నులతో ఆ తల్లి శింశుపా వృక్షం కింద కూర్చుని ఉంది.

గురువుల చేత శిక్షింపబడిన బుద్ధి కలిగిన లక్ష్మణుడి చేత ఆరాధింపబడే సీతమ్మ, పెద్దలచే కీర్తించే సీతమ్మ, రాముడి ఇల్లాలైన సీతమ్మ, ముందు రాముడు వెనుక లక్ష్మణుడు ఉండగా మధ్యలో నడవవలసిన సీతమ్మ, దశరథుడి పెద్ద కోడలైన సీతమ్మ, జనకుడి కూతురైన సీతమ్మ ఇవ్వాళ చుట్టూ రాక్షస స్త్రీలు ఉండగా, పది నెలల నుండి ఒకే వస్త్రాన్ని కట్టుకొని పడి ఉందంటే ..

"యది సీతాపి దుఃఖార్తా కాలోహి దురతిక్రమః "

"కాలం ఏదన్నా చెయ్యగలదు. ఈ కాలాన్ని ఎవరూ అతిక్రమించలేరు.

ఈ సీతమ్మ కోసమే 14 వేల రాక్షసులు,ఇంకా ఎంతో మంది రాక్షసులు చనిపోయారు. ఈ తల్లి కారణంగానే సుగ్రీవుడు పట్టాభిషేకం పొందాడు. వాలి తెగటారిపోయాడు. నువ్వు ఇక్కడ కూర్చున్నావు కాని, నీ వల్ల అక్కడ ఎంత కథ నడుస్తుందో తెలుసా అమ్మా.

నీకు నీ అమ్మ(భూదేవి) పోలిక వచ్చిందమ్మా, అందుకే నీకు ఇంత ఓర్పు ఉంది. రామలక్ష్మణుల చేత రక్షింపబడవలసిన తల్లివి. ఇలా వికృతమైన రాక్షస స్త్రీల మధ్యన చెట్టుకింద కూర్చున్నావా అమ్మా.

శీలం, వయస్సు, నడవడి, వంశం, శరీరం అనే ఈ అయిదు లక్షణాలలో నువ్వు తగినదానివని" హనుమ మనసులో భావించాడు. వరుడు పెళ్లి సమయంలో వధువు ఈ ఐదు లక్షణాలలో సరిపోతారో లేదో చూడాల్సిఉందని శాస్త్రాలు చెబుతున్నాయి.

"మా సీతమ్మ ముందు పాపాత్ముడైన రావణుడు నిలుచున్నా ఆమె కళ్ళు ఎప్పుడూ నల్లగానే, శాంతంగా ఉంటాయి. కాని రాముడి కళ్ళు కోపంతో అప్పుడప్పుడు ఎరుపెక్కుతాయి" అని హనుమ అనుకున్నాడు.

**యమ్వీఆర్**

# చనిపోయిన గొప్పవారా? బతికి ఉన్న సామాన్యులా?

భారతదేశ స్వాతంత్ర్య చరిత్రలో బాగా గుర్తుపెట్టుకోవాల్సిన నాయకులందరిలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఒకరు. దేశ తొలి ఉప ప్రధానమంత్రిగా, హోంశాఖ మంత్రిగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అతి కొద్ది కాలంలో ఆయన చేసిన అతి గొప్ప పని.. భారతదేశాన్ని ఏకం చేయటం. ఎందుకంటే మిగతా దేశాలను కూడా కలుపుకొని అతిపెద్ద రాజ్యాన్ని రాముడు పాలించాడంటారు. అయితే ఆ తర్వాత ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడి కాలానికే భారతీయం 54 దేశాలుగా స్థిరపడింది. ఆయా దేశాల భౌగోళిక వివరాలు, రాజ్యాల పేర్లు, పాలించిన వంశాలు, ఆ వంశాల్లోని రాజులు-అన్ని వివరాలు వ్యాసమహర్షి మహాభారతంలో దొరుకుతాయి.

భారతదేశమని మనం ఇప్పుడు పిలుస్తున్న విశాల ప్రాంతం కూడా అనేక దేశాలుగా, రాజ్యాలుగా విడిగానే ఉండి కాలక్రమేణా వివిధ భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఏర్పడ్డాయి. అయితే విదేశీ దండయాత్రలు, ముఖ్యంగా బ్రిటిష్ వారి పరిపాలనతో భారతదేశ భూభాగం మీద ఉన్న రాష్ట్రాలన్నీ ఏకమై ఒక్క దేశంగా ఏర్పడ్డాయి. అయితే చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలు అలాగే వారసత్వ పాలనలో ఉండేవి. దేశాన్ని ఒక్కటిగా బలోపేతం చేయటానికి స్వాతంత్ర్యం తర్వాత సర్దార్ పటేల్ చేసిన కృషి అమోఘం. ఈ చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాల పాలకులకు తగిన భరణం చెల్లించి అధికారాన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి తెచ్చారు సర్దార్ పటేల్. అయితే, ఈ కష్టతరమైన పని కంటే పదునైన, గొప్పదైన మాట ఒకటి అన్నారు ఆయన. ఇప్పటి ప్రజల ఇండ్లు కూల్చి, చనిపోయిన నాయకుల విగ్రహాలు పెడుతామంటున్న నేటి అజ్ఞానపు నాయకులకు పటేల్ మాట చెంపపెట్టు లాంటిది.

దేశాన్ని సర్దార్ పటేల్ ఏకం చేయటానికి, సాధించిన ఆ విజయానికి గుజరాతీలు పొంగిపోయి, కట్టకట్టుకుని ఢిల్లీ వెళ్లి ఆయనను కలిశారు. తమ రాష్ట్రంలో ఆయనది పెద్ద విగ్రహం పెడుతామని ఉత్సాహంగా చెప్పారు. దానికి ఆయన చెప్పిన సమాధానం విని నీరుగారిపోయారు ఆ గుజరాతీ బృందంలోని వాళ్లు. 'ఈనాడు మీరు నా విగ్రహం పెడుతారు. అయితే ఒక 50 ఏండ్ల తర్వాత రోడ్డు మీద వెళ్తున్నప్పుడు ఒక చిన్న పిల్లవాడు నా విగ్రహాన్ని చూపించి.. ఆయన ఎవరు నాన్నా? అని తన తండ్రిని అడుగుతాడు. చదువుకోని ఆ తండ్రి విచారంగా 'నాకు తెలియదు బేటా' అంటాడు. అందుకే నా గురించి చరిత్రలో ఉండాలి గానీ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డు మీద వచ్చే పోయే వారికి అడ్డంగా విగ్రహం లాగ ఉండటం నాకు ఇష్టంలేదు. విగ్రహం బదులు ఒక పాఠశాల స్థాపించి, నా గురించి ఒక పాఠ్యాంశం పెట్టండి. కనీసం చదువుకున్న వాళ్లకు నేనెవరో తెలుస్తుంది' అని సర్దార్ పటేల్ చెప్పారు.

మరి మన అజ్ఞానపు నాయకులు, ముఖ్యంగా చదువులేని, తెలివిలేని వారు వేల కోట్లు వెచ్చించి పటేల్ విగ్రహం పెట్టారు. ఆ ధనంతో పటేల్ ఆశయానికి తగ్గట్టు ప్రభుత్వ పాఠశాలలు పెట్టి, అందరు పిల్లలకు 12వ క్లాసు వరకు తప్పనిసరి విద్యా విధానం ప్రవేశపెడితే పటేల్ ఎవరో అందరికీ తెలుస్తుంది కదా! నిజంగా గొప్పవారి విగ్రహాలు అలా ఏ ఆచ్ఛాదనా లేకుండా ఉండటం చూస్తే చాలా బాధ కలుగుతుంది.

గొప్ప ఇంగ్లీష్ రచయిత ఆస్కార్‌వైల్డ్ రాసిన 'హ్యాపీ ప్రిన్స్' కథ గూగుల్‌లో దొరుకుతుంది, ఎవరైనా చదవవచ్చు. పేదవారి కష్టాలు పట్టించుకోకుండా రత్నాలు, మాణిక్యాలతో తన విగ్రహం చేసి పెట్టడం



ఆ ప్రిన్స్‌కు ఎంత బాధ కలిగిస్తుందో తెలుస్తుంది. ఇక అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న తెలంగాణ రాష్ట్రంలో రెండేండ్ల నుంచి ఈ అనాగరిక పద్ధతులే యథేచ్ఛగా సాగుతున్నాయి. తెలంగాణను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి, శతృపార్టీ తెలుగుదేశంతో కలిసి నాటకాలాడి, వందల మంది యువత ఆత్మహత్యలకు కారణమైన అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహం ఇక్కడ, మనకు అవసరమా? తెలంగాణ స్వరాష్ట్ర కాంక్షను వెలిబుచ్చే పాట పాడనన్న బాలసుబ్రహ్మణ్యం విగ్రహం నగరం నడిమధ్యన పెట్టడం దేనికి సంకేతం? 2014లో విడిపోయి రాష్ట్రమయ్యాక కూడా, ఆ ప్రాంతానికి తరలివెళ్లి స్థిరపడే ప్రేమలేని బాలసుబ్రహ్మణ్యానికి తమదికాని తెలంగాణ మీద ద్వేషం మాత్రం పుష్కలంగా ఉంది కదా! మరి వీళ్లంతా తెలంగాణ ప్రజా జీవితానికి ఏం ఒరగబెడుతారు?

జీవితం అనేది అదానీ, అంబానీలకు ఎంత విలువైనదో, సిమెంట్, కంకర మోసి వారి భవనాలు కట్టే కూలీలకు కూడా అంతే విలువైనది. న్యాయంగా మాట్లాడితే కూలీలదే ఎక్కువ విలువైనది. సబర్మతి ఆశ్రమంలో ఉండేవారు ఎవరి పని వారే కాక, ఆశ్రమం శుభ్రం చేసే పని కూడా చేయాలన్నది గాంధీ సిద్ధాంతం. గొప్పవారు తమ పిల్లలకు అది తెలియాలని కొన్ని రోజులు వారిని ఆశ్రమానికి పంపేవారు. బజాజ్ కుటుంబం నుంచి ఒక 20 ఏండ్ల అబ్బాయిని అతని తండ్రి ఆశ్రమానికి పంపాడు. అతి కష్టం మీద తన బట్టలు ఉతికి ఆరేసుకున్న ఆ కుర్రాడు టాయిలెట్లు మాత్రం శుభ్రపర్చనంటూ మొండికేశాడు. అప్పుడు గాంధీజీ అతన్ని పిలిచి 'ఏదైనా మలినం చేయడం గొప్ప పనా, శుభ్రం చేయటం గొప్ప పనా? అని ప్రశ్నించారు. దానితో ఆ కుర్రాడు గాంధీజీ మాటల్లోని ఆ గొప్ప సత్యాన్ని గ్రహించి, మరుగుదొడ్లు శుభ్రం చేశాడు. అంతేకాదు, ఆ తర్వాత తన వ్యాపారంతో కొంత మంది పేదవారికి కూడా చాలా సాయం చేశాడు. గాంధీజీ తన ఆత్మకథలో చాలా గొప్పవి, మంచి విషయాలు చెప్పారు.

ఒక మనిషి సంస్కారం అతను తన కంటే పైస్థాయి వ్యక్తులతో ప్రవర్తించే తీరులో కాదు, తన కంటే చాలా చిన్న స్థాయి వ్యక్తులతో మెలిగే తీరులో తెలుస్తుంది అని. మరి పాలన చేతగాని నేతలు.. నగర సుందరీకరణ అని జీవం ఉన్న ప్రజల కంటే నిర్జీవ వస్తువులకు, పనికిరాని విషయాలకు ప్రాధాన్యం ఇచ్చే పనులు చేస్తుంటే ప్రజలు ఏం చేయాలి? రూ.5000 కోట్ల విగ్రహం విలువ ఎక్కువనా? 500 కుటుంబాల జీవనం విలువైనదా? ప్రభుత్వం వద్ద అన్ని డబ్బులుంటే చిన్నారులను బలి తీసుకుంటున్న గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించవచ్చు కదా! ప్రకృతిలో చీమ దగ్గర నుంచి అతిపెద్ద జంతువు వరకు అన్ని ప్రాణులు విలువైనవే! పోయిన గొప్పవారి గురించి పిల్లలకు చదువు ద్వారా చెప్పాలి కానీ, వేలకోట్లు వృథా చేసి, విగ్రహాలు నిలపటం తెలివితక్కువ పని.

గాంధీజీనే పూజిస్తామని చెప్పుకునేవాళ్లకు మహాత్ముడు అనుసరించిన తత్వం 'దరిద్ర నారాయణ సేవ' అని తెలియదా? సామాన్యుల ఇండ్లు కూల్చి, తన విగ్రహం పెట్టడాన్ని గాంధీజీ హర్షిస్తారా? చదువు, సంస్కారం లేని నాయకులు ఆనందపడుతారేమో కానీ, గాంధీజీ మాత్రం ఇటువంటి పనులు చేసే వాళ్లను క్షమించరు. గొప్పవాళ్ల శాపాలు ఎలా ఉంటాయో తెలియాలంటే మహా భారతంలో పరీక్షిత్తు కథ చదవాలి.

పాలకులందరూ ఒక ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోవాలని గాంధీజీ చెప్పారు. 'పేదరికం అన్నింటి కంటే భయంకరమైన హింస. పాలకుడిని అనుకునేవాడి దృష్టి ధనవంతులకు సాయం చేయటం మీద కాదు, పేదవారికి ఉపాధి కల్పించి, లేని పక్షంలో వారి కనీస అవసరాలు తీరే వసతులు కల్పించాలి' అని. మరి కనీస వసతి కల్పించకపోగా, సామాన్యులు వారే కష్టపడి కట్టుకున్న ఇండ్లు కూల్చడమంటే గాంధీజీ ఏమంటారో ఊహించండి. పాలకులు హిరణ్య కశ్యపులు, హిరణ్యాక్షులు అయితే ప్రజలు కల్కి అవతారం ఎత్తాల్సిందే కదా!

**- కనకదుర్గ దంటు**

# వినియోగంలో లేని పీఎఫ్ ఖాతాల్లో డిపాజిట్ల రిఫండ్



వినియోగంలో లేని (ఇనాపరేటివ్) దాదాపు ఏడు లక్షల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాల్లోని సుమారు రూ.30.52 కోట్ల మొత్తాన్ని రిఫండ్ చేయడంపై ఈపీఎఫ్‌వో దృష్టి పెడుతోంది. సదరు ఖాతాదారులు లేదా వారి లీగల్ వారసులకు త్వరలో బదిలీ చేయనున్నట్లు కార్మిక శాఖ వర్గాలు తెలిపాయి. రూ.1,000 వరకు బ్యాలెన్స్ ఉన్న 7.11 లక్షల ఖాతాలను సెటిల్ చేయాలని కార్మిక, ఉపాధి శాఖ ఒక సమీక్షలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించాయి.

ఉద్యోగి లేదా కంపెనీ నుంచి 36 నెలలకు పైగా ఎలాంటి జమ లేని పీఎఫ్ ఖాతాలను ఇనాపరేటివ్‌గా పరిగణిస్తారు. సంబంధిత వర్గాల ప్రకారం 31.86 లక్షల ఇనాపరేటివ్ ఖాతాల్లో మొత్తం రూ. 10,903 కోట్లు ఉన్నాయి. వాటిలో రూ. 1,000 లేదా అంతకన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లు ఏడు లక్షలు ఉన్నాయి. ఆధార్‌తో అనుసంధానమైన ఈపీఎఫ్ ఖాతాలున్న వారి బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తాలను తక్షణం బదిలీ చేయనున్నారు.

**ఖాతాదారు చనిపోతే..**

ఒకవేళ ఖాతాదారు మరణించిన పక్షంలో నామినీ లేదా చట్టబద్ధ వారసులకు చెల్లిస్తారు. అటు, సభ్యులు, సంస్థలకు మెరుగైన సర్వీసులు అందించేందుకు ఈపీఎఫ్‌వో 3.0 ప్రాజెక్టుపై కేంద్రం కసరత్తు చేస్తోంది. (EPFO 3.0: పీఎఫ్ విత్‌డ్రా మరింత సులభం!)

# 'ఆయా షేర్' హుక్ స్టెప్.. ఒరిజినల్ నాదే అని యూట్యూబర్



ప్రస్తుతం తెలుగు ప్రేక్షకుల.. 'ఆయా షేర్' పాట వింటూ చిల్ అయిపోతున్నారు. నాని హీరోగా నటిస్తున్న 'ప్యారడైజ్' సినిమాలోని పాట ఇది. అనిరుధ్ సంగీతమందించాడు. నాని పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సాయంత్రం దీన్ని రిలీజ్ చేయగా.. వెంటనే సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిపోతోంది. మ్యూజిక్, బీట్, లిరిక్స్ అన్ని అద్భుతంగా ఉన్నాయని అందరూ తెగ మెచ్చుకుంటున్నారు. ఓ యూట్యూబ్ మాత్రం ఇందులో నాని వేసిన హుక్ స్టెప్ నాదే అని, కాపీ కొట్టేశారని అంటున్నాడు.

హైదరాబాద్‌లో బాబా జాక్సన్ పేరుతో ఉన్న ఓ ఇన్ఫ్లూయెన్సర్.. ఇన్ స్టా, యూట్యూబ్‌లో డాన్స్ వీడియోలతో బాగానే ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. గతంలో ఇతడు ఓ విదేశీయుడితో కలిసి వేసిన స్టెప్‌నే ఇప్పుడు 'ఆయా షేర్' పాటలో కాపీ కొట్టేశారని అంటున్నారు. ఈ మేరకు తన ఇన్ స్టాలో సదరు ఇన్ఫ్లూయెన్సర్.. ఒరిజినల్ ఇదే అంటూ రెండు వీడియోలు కూడా పోస్ట్ చేశాడు.

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ద ప్యారడైజ్'. పీరియాడిక్ యాక్షన్ మూవీ ఇది. మోహన్ బాబు విలన్ కాగా.. బాలీవుడ్ నటుడు రాఘవ్ జ్యూయెల్ కీలక పాత్ర చేస్తున్నాడు. కాయదు లోహర్ హీరోయిన్. తొలుత మార్చి 26నే థియేటర్లలోకి తీసుకురావాలనుకున్నారు కానీ షూటింగ్ ఆలస్యం కారణంగా ఆగస్టు 21కి వాయిదా వేశారు. కొన్నిరోజుల క్రితమే అధికారికంగా ఓ పోస్టర్ కూడా రిలీజ్ చేసి కొత్త విడుదల తేదీని ప్రకటించారు. తాజాగా తొలి గీతం వదిలి, అమాంతం హైప్ సొంతం చేసుకున్నారు.

# జుట్టు ఆరోగ్యం కోసం ఆలయమా..?




ప్రస్తుతం ఉన్న కాలుష్యం, ఉరుకుల పరుగుల జీవన విధానం వంటి కారణాలతో చాలామంది జుట్టు రాలు సమస్యను ఫేస్ చేస్తున్నారు. దానికి తోడు సరైన జీవనశైలి కూడా లేకపోవడంతో ఈ సమస్య ఇటీవల కాలంలో ఎక్కువగా ఉంది. ఇది అందరికీ తెలిసిందే కదా..! మళ్లా ఇదంతా ఎందుకనుకుంటున్నారా..?. ఏం లేదండి ఏకంగా జుట్టు ఆరోగ్యం కోసం ఆలయమే ఉంది ఆ దేశంలో. కురులు మంచి ఒత్తుగా, దృఢంగా ఉండాలంటే ఆ ఆలయానికి వెళ్లి దేవుడిని దర్శిస్తే చాలట. అంతేకాదండోయ్ ఏటా వేలాది మంది ప్రజలు ఈ ఆలయాన్ని దర్శించుకోవడానికి తరలి వస్తుంటారట. వినడానికి ఇది..ఇదేం విచిత్రం రా బాబు అనిపిస్తోంది కదూ..!. ఎక్కడైన జుట్లు రాలకుండా లేదా ఆరోగ్యం కోసం ఆలయం ఉంటుందా?..నమ్మశక్యంగా అనిపించడం లేదు కదా..!. అయితే వెంటనే జపాన్‌లోని క్యోటోలో ఉన్న మికామి పుణ్యక్షేత్రానికి వచ్చేయండి. ఇది జుట్టు కోసం అంకితం చేయబడిన ఆలయమట. జుట్టు పెరుగుదల, ఆరోగ్యం, జుట్టు రాలడం వంటి ఆందోళనలు నివారించుకోవాలనుకుంటే తక్షణమే ఈ ఆయానికి వెళ్లి ప్రార్థిస్తే చాలట.

అంతేకాదు కొత్త హెయిర్ స్టైలిస్టులుగా బ్యూటీషియన్ రంగంలోకి అడుపెట్టే విద్యార్థులు సైతం ముందుగా ఈ ఆలయానికి వచ్చి ప్రార్థించాక..తమ కోర్సుని నేర్చుకుంటారట. అంతేకాదండోయ్ ఇక్కడ ప్రార్థన అత్యంత విచిత్రంగా ఉంటుంది. అక్కడ మసాయుకి ఫుజివారా అనే దేవుడు కొలువై ఉంటాడు. ముందుగా ఆ ఆలయానికి చేరుకునే మునుపే ఒక ప్రార్థన కవర్‌ని కొనుగోలు చేయాలట.

అక్కడ ఆలయ పూజారులు మన జుట్టులో కొంత జుట్టుని కత్తిరించి ఆ కవర్‌లో వేస్తారట. ఆ తర్వాత మనం దాన్నితీసుకుని ఆ ఆలయంలో ఉన్న మసాయుకి ఫుజివారా దేవుడి వద్ద పెట్టి ప్రార్థించి అక్కడ ఉండే పూజారికి ఇవ్వాలట ఆ కవర్‌ని. అలా చేస్తే వారి జీవితంలో జుట్టుకి సంబంధించిన సమస్యలు రావు, పైగా ఒత్తుగా పెరుగుతుందనేది అక్కడి ప్రజల ప్రగాఢ నమ్మకం. అంతేకాదండోయ్ ఆ ఆలయం వెనుక ఓ ఆసక్తికర కథ కూడా ఉంది. అదేంటంటే..

**ఓ క్షరకుడి నైపుణ్యానికి ప్రతీక..**

మికామి మందిరం జపాన్‌లోని మొట్టమొదటి కౌరశాల అట. ఫుటివారా ఉనెమెనోసుకే మసాయుకి అనే క్షరకుడు తన వృత్తిని దైవంగా భావించి పనిచేసేవాడట. తన కుటుంబాన్ని పోషించుకునేందుకు ఎంతో అద్భుతంగా జుట్టుని కత్తిరించడం, స్టైలింగ్ చేయడం వంటివి చేశాడట. అలా తన జీవితం మొత్తం ఆ వృత్తికి అంకితం చేసి..మంచి పునాది వేశాడట. అంతలా ఆ రంగంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించందుకు గుర్తుగా అత్యున్నతంగా గౌరవించాలని అక్కడి ప్రజలు నిర్ణయించి.. ఇలా ఒక ఆలయాన్ని నిర్మించి పూజించుకుంటున్నారట.

అంతేగాదు అతడి గౌరవార్థం చనిపోయిన 17వ తేదీన ప్రతినెల జపాన్ అంతటా క్షరకులు సెలూన్ల నిర్వాహకులు నివాళులర్పిస్తూ..దుకాణాలు కూడా మూసివేస్తారట. అలాగే ఈ ఆలయానికి వచ్చిన భక్తులకు ఆ మసాయుకి దేవుడిని ప్రార్థించాక.. జుట్టుకి సంబంధిత సమస్యలు తగ్గుముఖం పట్టడంతో..ఈ దేవాలయానికి మరింత పేరుప్రఖ్యాతలు వచ్చి.. జుట్టు ఆరోగ్యానికి సంబంధించిన ఆలయంగా స్థిరపడిందట. అంతేగాదు ఇక్కడకు పర్యాటకుల తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుందట.

# బిజినెస్ మిక్స్‌పై ఏఐ తీవ్ర ప్రభావం



ప్రస్తుతం ప్రపంచ ఐటీ రంగాన్ని కుదిపేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ).. సాఫ్ట్‌వేర్ సర్వీసుల్లో పెను మార్పులకు తెరతీస్తున్నట్లు బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ తాజా నివేదిక పేర్కొంది. వెరసి ఐటీ రంగం వ్యవస్థాగతంగా తీవ్ర మార్పులకు లోనుకానున్నట్లు అభిప్రాయపడింది. ఐటీ రంగానికి కీలకమైన బిజినెస్ మిక్స్‌ను ఏఐ పునర్‌నిర్వచించనున్నట్లు తెలిపింది. తద్వారా కాలానుగుణ మార్పులు (సైక్లికాలిటీ) పెరగడంతోపాటు.. నిర్వహణా పద్ధతులు, నైపుణ్యాలు పునసమీక్షించుకోవలసి ఉన్నట్లు వివరించింది. ఏఐ సవాళ్లు ముగియలేదని, కన్సల్టింగ్, ఇంప్లిమెంటేషన్ పెరుగుతున్నప్పటికీ ఏఐ ఆధారిత మార్పులు సంప్రదాయ మేనేజ్‌డ్ సర్వీసులకు చెక్ పెట్టే అవకాశమున్నదని పేర్కొంది. ఇప్పటికే ఐటీ దిగ్గజ కౌంటర్లు గరిష్టాల నుంచి 20ఉ25 శాతం మధ్య పతనమైనప్పటికీ మరింత క్షీణతకు వీలున్నట్లు నివేదికలో జెఫరీస్ అంచనా వేసింది. ఈ బాటలో ఐటీ పరిశ్రమ లీడర్స్ టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లను సైతం డౌన్‌గ్రేడ్ చేసింది. తద్వారా షేర్ల ధరల టార్గెట్‌ను 33 శాతంమేర కుదించింది. ఇటీవల ఆంత్రోపిక్ క్లాడ్ తదితరాలు అసిస్టెంట్ల స్థాయి నుంచి క్లిష్టమైన టాస్క్‌లకు సైతం పూర్తి చేయగల టూల్స్‌ను రూపొందిస్తూ ఏఐ సవాళ్లు విసురుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొద్ది వారాలుగా సంప్రదాయ ఐటీ సర్వీసులు సహా.. సాఫ్ట్‌వేర్ విభాగ సేవలకు చెక్ పడే వీలున్నదని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నట్లు నివేదిక వివరించింది. ఆదాయాల్లో 22ఉ45% వరకూ ఆక్రమిస్తున్న అప్లికేషన్ మేనేజ్‌డ్ సర్వీసుల నుంచి ఐటీ కంపెనీలు అడ్వయిజరీ, ఇంప్లిమెంటేషన్‌వైపు వ్యవస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టవలసి ఉంటుందని సూచించింది. కాగా.. ఈ ప్రభావంతో దేశీయంగా ఫిబ్రవరి తొలి 3 వారాల్లోనే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 20% పతనంకావడం గమనార్హం!

# కళ్లకు గంతలు...సహా ఆ సిటీలో వెరైటీ డేటింగ్స్ ఎన్నో



దేశవ్యాప్తంగా పలు నగరాల్లో శరవేగంగా డేటింగ్ సంస్కృతి విస్తరిస్తోంది. అవివాహితుల నుంచి మొదలుకుని వేర్వేరు కారణాల వల్ల ఒంటరిగా మిగిలిన వారి సంఖ్య భారీగా పెరుగుతుండడం వారు కూడా తోడు కోసం తహతహలాడుతుండడంతో ఈ కల్చర్ ఇప్పటికే స్థిరపడడంతో పాటు రకరకాలుగా రూపాంతరం చెందుతోంది, ముఖ్యంగా ఆన్‌లైన్ సేవల విజృంభణ ఈ సంస్కృతికి ఆజ్యం పోస్తోంది. దేశవ్యాప్తంగా చూస్తే డేటింగ్ కల్చర్‌లో ఢిల్లీ, ముంబయి, బెంగుళూర్, పూణె, హైదరాబాద్,చెన్నై... వంటి నగరాలు దూసుకుపోతున్నాయి అయితే డేటింగ్ ఇష్టులు అత్యధిక సంఖ్యలోఉన్న నగరం బెంగుళూరు అని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఈ సిలికాన్ సిటీ వాసులు ఈ కల్చర్‌కి భారీ స్థాయిలో ఇష్టపడుతుండడంతో ఆర్గనైజర్లు వినూత్న తరహా డేటింగ్స్‌ను అందుబాటులోకి తెస్తున్నారు.

ఆన్‌లైన్ డేటింగ్ స్థానంలో వినూత్నమైన వ్యక్తిగత అనుభవాలు వస్తున్నాయి. డేటింగ్‌ను మరింత సరదాగా మార్చడానికి వ్యక్తుల కళ్లకు గంతలు కట్టడం నుంచి రహస్య సంకేతాల వరకు అనేక కొత్త ఆలోచనలను డేటింగ్ సంస్థల నిర్వాహకులు అమలు చేస్తున్నారు. బెంగుళూర్‌కి చెందిన స్మాల్ వరల్డ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు సౌరవ్ ఆర్య మాట్లాడుతూ, కరోనా సమయంలో డిజిటల్ డేటింగ్ బాగా ఊపందుకుందని అయితే, ఇప్పుడు వ్యక్తిగత సంబంధాల కోసం ప్రజలు ఆరాటపడుతున్నారని చెప్పారు.

జూమ్ మీటింగ్స్‌పై విరక్తి పెరగడంతో, ఇప్పుడు నిజ జీవిత డేటింగ్ ఈవెంట్‌లకు డిమాండ్ ఏర్పడిందనీ ఇవి భవిష్యత్తు కాబోయే భాగస్వాముల కోసం మాత్రమే కాకుండా, సుదీర్ఘ ఒంటరితనానికి ఒక సామాజిక విరుగుడుగా కూడా ఉపయోగపడుతున్నాయని ఆయన చెబుతున్నారు.ఆయన కంపెనీ ఇప్పటివరకు 40 ఈవెంట్‌లను నిర్వహించింది, ప్రతి ఈవెంట్‌లో 30 మంది పాల్గొంటున్నారు. ఇక స్పీడ్ డేటింగ్ అనేది మరొక సామాజిక కార్యకలాపం, దీనిలో రొమాంటిక్ సంబంధాల కోసం చూస్తున్న వ్యక్తులు ఒకరినొకరు తెలుసుకోవడానికి వరుసగా చిన్న చిన్న సంభాషణలు జరుపుతారు. స్పీడ్ డేటింగ్ ప్లాట్‌ఫామ్ అయిన అన్ ఫోల్డ్‌లవ్ సహఉ వ్యవస్థాపకుడు ఒకరు మాట్లాడుతూ, సేహేయ్ అనే మరో డేటింగ్ పద్ధతి కూడా నగరానికి ఇప్పుడిప్పుడే పరిచయం అవుతోంది అని అయన చెప్పారు. "కానీ ప్రజలు ఈ ఆలోచనకు అలవాటు పడుతున్నారు ," అని ఆయన అన్నారు. బెంగళూరులో ఒక మీమ్ ఆధారిత డేటింగ్ యాప్ కూడా అందుబాటులోకి వచ్చింది. స్మూజ్ అని పేర్కొనే ఈ యాప్‌ను విద్యా మాధవన్ అభినవ్ అనురాగ్ లు అమెరికాలో ప్రారంభించారు. "ఇతర యాప్‌లలో మీరు వ్యక్తులపై స్వైప్ చేసినట్లు కాకుండా, స్మూజ్‌లో మీరు మీమ్స్‌పై స్వైప్ చేస్తారు. మీరు స్వైప్ చేసే మీమ్స్ మీ ఇష్టాయిష్టాలను బాగా అర్థం చేసుకోవడానికి మాకు సహాయపడతాయి, ఆపై మేము మీకు తగిన భాగస్వాములను అందిస్తాం" అని విద్య వివరించారు. డేటింగ్ యాప్‌లకు అనుకూలంగా లేని సంప్రదాయవాదులు కూడా స్మూజ్‌ను ప్రయత్నించడానికి సిద్ధంగా ఉన్నారు, ఎందుకంటే వారికి ఈ కాన్సెప్ట్ సరదాగా అనిపించింది. ప్రతి ఒక్కరూ మీమ్స్‌ను ఇష్టపడతారు కదా" అని ఆమె అన్నారు.

తొలుత అమెరికాలో లాంచ్ అయిన ఈ యాప్‌కు ఆన్ లైన్ లో ప్రాచుర్యం పొందడంతో, భారతదేశంలో కూడా దీనిని ప్రారంభించమని అనేక అభ్యర్థనలు వచ్చాయని ఆమె చెప్పారు. అయితే "అభ్యర్థనలలో ఎక్కువ భాగం బెంగళూరు నుంచే వచ్చాయి. డెమో యాప్‌ను ప్రారంభించిన స్వల్ప వ్యవధిలోనే, ఒక్క బెంగళూరు నుంచే 5,000 కంటే ఎక్కువ డౌన్ లోడ్‌లు రావడం గమనార్హం. గత కొన్ని నెలలుగా, భారతీయ భాషలలోని ఇతర డేటింగ్ యాప్‌లు కూడా బెంగళూరులో ప్రజాదరణ పొందుతున్నాయి. ఉదాహరణకు, నీనే అనేది కన్నడిగుల కోసం మాత్రమే నిర్వహిస్తున్న ఒక డేటింగ్ యాప్. నేను నా కమ్యూనిటీకి చెందిన వారితో మాట్లాడగలుగుతున్నాను కన్నడ సినిమాల గురించి చర్చలు కూడా జరుపుతున్నాను, ఇది ఇంతకు ముందు సాధ్యమయ్యేది కాదు. టిండర్ బంబుల్ వంటి ఇతర యాప్‌లన్నీ చాలా సాధారణంగా మారిపోయాయి, ప్రతిచోటా ఒకే రకమైన వ్యక్తులు ఉంటున్నారు, కాబట్టి సంభాషణ చాలా చప్పగా తయారైంది," అని 2017 నుంచి డేటింగ్ యాప్‌లను ఉపయోగిస్తున్న 33 ఏళ్ల వనిత చెబుతోంది. ఏతావాతా... పెళ్లి నుంచి ప్రేమ వరకూ అలాగే జీవిత కాల సంబంధం నుంచి స్వల్పకాలిక శారీరక మానసిక అవసరాల వరకూ తీర్చుకోవడానికి అందుబాటులోకి వచ్చిన ఈ డేటింగ్ సంస్కృతి భారతీయ నగరాల్లో మరిన్ని కొత్త పోకడలు తీసుకురానుండడం తథ్యంగా కనిపిస్తోంది.

# ఇదేం అలసట బాబోయ్



రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాలంటే? దీని కోసం డాక్టర్ల దగ్గరి నుంచి పెద్దవాళ్ల వరకూ అంతా ఇచ్చే సలహా ఒకటే. రాత్రిపూట తగినంత సేపు నిద్రపోవాలనే. నిజమే. ఎప్పుడైనా ఆలస్యంగా పడుకున్నా, త్వరగా లేచినా మర్నాడు నిరుత్సాహం, నీరసం ముంచుకొచ్చేస్తాయి. కానీ తగినంత నిద్రపోయినా అలసట వేధిస్తుంటే? తప్పకుండా ఆలోచించాల్సిందే.

ఉదయం లేస్తూనే చిరాకు. మూడ్ ఏదోలా ఉంటుంది. ఏ పనిచేయాలన్నా బద్ధకం. దేని మీదా ఆసక్తి ఉండదు. అలాగని రాత్రంతా మెలకువగా ఉన్నామా అంటే అదీ లేదు. బాగానే నిద్రపోయాం. మరెందుకీ కునికిపాట్లు? మళ్లీ పడుకోవాలని ఎందుకనిపిస్తోంది? మగతగా ఎందుకుంటోంది? ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న సమస్యే ఇది. రాత్రిపూట 7–8 గంటల సేపు నిద్రపోయినా మర్నాడు ఏదో తెలియని అలసట. దీనికి ప్రధాన కారణం గాఢ నిద్ర కొరవడటమే. అవును... ఎన్ని గంటలనేదే కాదు, ఎంత హాయిగా నిద్రపోయామన్నదీ ముఖ్యమే. 10–12 గంటల సేపు పడుకున్నా కూడా కంటి నిండా నిద్ర పట్టకపోతే హుషారు గల్లంతవుతుంది. మనకు తెలియకుండానే ఎన్నెన్నో అంశాలు ఈ గాఢ నిద్రను దెబ్బతీస్తుంటాయి.

**కారణాలు రకరకాలు**

**డిజిటల్ తెరలు:** మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీ తెరల నుంచి వెలువడే నీలికాంతి మెదడును తికమకపరుస్తుంది. రాత్రినీ పగలుగా భావించేలా చేస్తుంది. దీంతో నిద్రను ప్రేరేపించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా మెదడు చురుకుగా ఆలోచిస్తుంటుంది. మొత్తానికి గాఢ నిద్ర కరవవుతుంది.

కెఫీన్, మిఠాయిలు: రాత్రిపూట టీ, కాఫీ తాగటం.. చాక్లెట్లు, మిఠాయిలు తినటం వల్ల నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. దీంతో శరీరం విశ్రాంతి స్థితికి చేరుకోక నిద్ర దెబ్బతింటుంది.

వేళాపాళా లేని పడక: రోజుకోరకంగా ఎప్పుడు పడితే అప్పుడు పడుకోవటం, లేవటం వల్ల ఒంట్లో జీవగడియారం అస్తవ్యస్తమవుతుంది. దీంతో నిద్ర, మెలకువల తీరు గతి తప్పి నీరసం, నిస్సత్తువ ఆవహించేస్తాయి.

**నిద్ర సమస్యలు:** కొందరికి నిద్రిస్తున్నప్పుడు గొంతు వెనకాల భాగం వదులై, కిందికి జారుతుంది. ఇది శ్వాసమార్గానికి అడ్డుపడటం వల్ల కాసేపు శ్వాస ఆగుతుంది (స్లీప్ అప్నియా). అప్పుడు వెంటనే మేల్కొని, గట్టిగా గురక పెడుతూ తిరిగి శ్వాస తీసుకుంటుంటారు. నిద్రలో ఉండటం వల్ల మెలకువ వచ్చిన సంగతి తెలియదు. ఇలా రాత్రంతా చాలాసార్లు జరుగుతుంది. దీంతో గాఢ నిద్ర కరవవుతుంది. రక్తంలో ఆక్సిజన్ తగ్గటం వల్ల పగటిపూట మగతగా, నిస్సత్తువగా ఉంటుంది. కాళ్లలో చిరచిర (రెస్ట్‌లెస్ లెగ్స్ సిండ్రోమ్) వంటి నిద్ర సమస్యలూ గాఢ నిద్రను దెబ్బతీస్తాయి.

**థైరాయిడ్ సమస్యలు:** థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం కూడా కారణమే. తగినన్ని థైరాయిడ్ హార్మోన్లు విడుదల కాకపోతే జీవక్రియ మందగిస్తుంది. నిద్ర ప్రక్రియా అస్తవ్యస్తమవుతుంది. నిద్రలేమితో థైరాయిడ్ పనితీరూ తగ్గుతుంది. ఇలా ఇదొక విషవలయంగా తయారవుతుంది. ఫలితం– అదేపనిగా నీరసం.

పరిసరాలు: పడకగది మరీ వేడిగా లేదా మరీ చల్లగా ఉన్నా.. గాలి సరిగా ఆడకపోయినా, పరిసరాల్లో వాహనాల హారన్ మోతల వంటి చప్పుళ్లు వినిపిస్తున్నా నిద్రకు విఘాతం కలుగుతుంది. మధ్యమధ్యలో మెలకువ వచ్చేస్తుంది.

రక్తహీనత: ఐరన్ లోపంతో తలెత్తే రక్తహీనత (ఎనీమియా)లో ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గుతుంది. దీంతో శరీరానికి తగినంత ఆక్సిజన్ అందదు. ముఖ్యంగా మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోతే నీరసానికి దారితీస్తుంది. రక్తహీనతతో కాళ్లలో చిరచిర, ఆయాసం వంటి సమస్యలూ తలెత్తొచ్చు. ఇవీ నిద్రకు భంగం కలిగించేవే. విటమిన్ బి12 లోపమూ రక్తహీనతకు కారణమవుతుంది.

**సరిచేసు కోవాల్సిందే**

నిద్ర శరీరాన్నే కాదు, మనసునూ పునరుత్తేజితం చేస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి రకరకాల సమస్యలు దాడి చేయటం ఖాయం. కాబట్టి గాఢ నిద్రను దెబ్బతీస్తున్న అంశాలను గుర్తించి, సరిచేసుకోవటం చాలా ముఖ్యం.

పడకగదిలో మొబైల్ ఫోన్ల వంటివి వాడకపోవటం
రాత్రిపూట మరీ ఎక్కువగా తినకపోవటం
పడుకోవటానికి రెండు గంటల ముందే భోజనం చేయటం
పడకగది చల్లగా, ప్రశాంతంగా ఉండేలా చూసుకోవటం
రాత్రివేళ కాఫీ, టీ, కూల్‌డ్రింకులు తాగకపోవటం
క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం
నిద్ర సమస్యలకు తగు చికిత్స తీసుకోవటం
ఆఫీసు నుంచి వచ్చాక గోరువెచ్చటి నీటితో స్నానం చేయటం, పడుకునే ముందు గ్లాసు పాలు తాగటం.

– ఇలాంటి జాగ్రత్తలు గాఢ నిద్రకు తోడ్పడతాయి. అప్పుడు ఉత్సాహం ఎల్లప్పుడూ వెంటే ఉంటుంది

# మీతో మీరు అనుబంధం ఏర్పరుచుకోండి...



'నేటి ఉరుకుల పరుగుల జీవితంలో స్త్రీ, పురుషులు కుటుంబాల కోసం, ఉద్యోగాల కోసం, ఆర్థిక ఎదుగుదల కోసం ఏమేమి చేయాలా అని నిత్యం ఆందోళన చెందుతున్నారుగానీ తమ కోసం తాము ఏం చేసుకోవాలనే సంగతిని మర్చి తున్నారు. నేడు ప్రతి మనిషి అన్నీ పట్టించుకుంటూ తనను తాను నిర్లక్ష్యం చేసుకుంటున్నాడు. మీకేమి కావాలో గ్రహించండి. మీతో మీరు అనుబంధం పెంచుకోండి' అన్నారు 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆధ్యాత్మిక మార్గదర్శి గురు గోపాల్‌దాస్. 'అయిన వారి కోసం అన్నీ చేయాల్సిందే... కానీ వారి కంటే మీ అయిన వారు మీరే. మీకేం కావాలి? మీ ఇష్టాల గురించి, ఆరోగ్యం గురించి, అభిరుచుల గురించి, లక్ష్యాల గురించి, అసలేమీ చేయకుండా కొన్నాళ్లు గడపాలనుకుంటున్న తీరిక సమయాల గురించి మీరేమి చేసుకుంటున్నారు? మీతో మీ అనుబంధం సరిగా లేకో తే మీ అయినవారికి మీరు చేయాల్సిందంతా ఎలా చేయగలరు?' అని ప్రశ్నిస్తారు గురు గోపాల్‌దాస్. 'జైపూర్ సాహితీ సంరంభం' లో తన తాజాపుస్తకం 'యూ కెన్ హావ్ ఇట్ ఆల్' వెలువడిన సందర్భంగా జీవన మార్గాల సులభతరం గురించి ఆయన మాట్లాడారు. మార్చలేని సమస్యలు ప్రతి మనిషికీ జీవితంలో సమస్యలు ఉంటాయి. వాటిలో కొన్ని పరిష్కరించేవి ఉంటాయి... కొన్ని పరిష్కరించలేనివి. ఉదాహరణకు ఫలానా వ్యక్తికి మీరంటే పడదు... మీ గురించి చెడు చెప్తుంటాడు... మీరు ఎంత ప్రయత్నించినా మారడు. దానిని నేను గణితంలో 'పై'తో లుస్తాను. ఏం చేసినా దాని విలువ మారదు. కాబట్టి మార్చలేని సమస్యలను పూర్తిగా వదిలిపెట్టాలి. వాటికై ఏ మాత్రం శక్తి వృథా చేయకూడదు. రెండో రకం సమస్యలు... మార్చదగ్గవి. మీ అబ్బాయికి మంచి కాలేజ్‌లో సీటు రాని పరిస్థితి ఉంటే మెరుగైన కాలేజ్‌లో అయినా మీరు సంపాదించగలరు కదా. దీనిని నేను గణితంలో 'ఎక్స్' విలువ కనుగొనడంతో లుస్తాను. అలాంటి ఎక్స్ సమస్యల గురించి పని చేయాలి. కాబట్టి 'పై'ను వదిలిపెట్టండి. 'ఎక్స్' సంగతి చూడండి.రాళ్లు కింద పడేయండి ఒక సాధువు దగ్గరకి ఒక కుర్రవాడు వచ్చి 'స్వామీ... నాకు మనశ్శాంతి కావాలి' అని అడిగితే ఆ సాధువు కొన్ని రాళ్ల చూపించి 'వాటిని వారంపాటు మూటలో వేసుకుని విడువకుండా తిరుగు' అన్నాడు. ఆ కుర్రవాడు ఆ రోజూ ఆ రాళ్లమూటతో తిరగడం మొదలెట్టాడు. ఆ రాళ్లు రాను రాను బరువయ్యాయి. చివరిరోజు సాధువు ఆ మూటను కింద పడేయ్ అనగానే కుర్రవాడికి మనశ్శాంతి అంటే ఏమిటో అర్థమైంది. మనమంతా అనవసర రాళ్లను మోస్తూ ఉంటాం. అసూయ, కుళ్లు, కుతంత్రం, ద్వేషం, పగ, దురాశ, స్వార్థం... సంబంధం లేని వ్యక్తి/విషయం గురించి అభిప్రాయం, సామాజిక మాధ్యమాలలో ముసుగు ముఖంతో విమర్శలు గుప్పిస్తుంటాం... ఇవన్నీ బరువులు. ఈ రాళ్లను ప్రతిరోజు ఉదయాన్నే లేచి లెక్కబెట్టి పారేయండి. మనశ్శాంతి తప్పక దొరుకుతుంది.మాట్లాడండి నేటి మనిషి దేని గురించీ మాట్లాడటం లేదు. అన్నీ మనసులో పెట్టుకుంటున్నాడు. నీతో ఈ సమస్య ఉంది... నా వల్ల ఈ ÷రపాటు జరిగింది... అని భార్యాభర్తలు, పిల్లలు, ఉద్యోగులు, ఇరుగు ÷రుగు వారు మాట్లాడుకుంటే సమస్యలు లేని సామరస్య జీవితం దొరుకుతుంది. చాలా సమస్యలు కేవలం మాట్లాడకో డం వల్ల పాషాణరూపం దాలుస్తాయి. మౌనం సమస్యకు మూలం. మౌనం వద్దు. మాట మొదలెట్టండి... మాట్లాడండి అని బోధించారు గురు గోపాల్‌దాస్. ఆయన మాటలను వినడంతో వదిలేయకుండా ఆచరణలో పెడితేనే మనశ్శాంతి కలుగుతుంది.

# గోటి సౌందర్యం గొప్పదే



గోళ్లను పెద్దగా పట్టించుకోం గానీ సున్నితమైన వేళ్ల చివర్లను కాపాడే రక్షణ కవచాలివే. చిన్న చిన్న వస్తువులను ఏరటం, పట్టుకోవటం, గోకటం వంటి పనులకే కాదు.. అందంగా కనిపించటానికీ తోడ్పడతాయి.

నఖ శిఖ పర్యంతమూ అని ఊరికే అనలేదు మరి. అలాంటి గోళ్లు ఎగుడుదిగుడుగా పెరిగితే? చూడటానికి వికారంగా కనిపిస్తే? తేలికగా విరుగుతుంటే? వీటికి ఫంగల్ ఇన్‌ఫెక్షన్, తరచూ దెబ్బలు తగలటం, సొరియాసిస్, ఏనుగు గజ్జి వంటి సమస్యలు కారణం కావొచ్చు. ఐరన్, జింక్, బయోటిన్ లాంటి పోషకాల లోపమూ గోళ్లను దెబ్బతీస్తుంది. థైరాయిడ్ సమస్యలోనూ గోళ్లు సరిగా పెరగకపోవచ్చు. కొందరు మాటిమాటికీ గోళ్లు కొరుకుతుంటారు. ఇదీ నఖ సౌందర్యాన్ని చెడగొడుతుంది. ఇలాంటి కారణాలను గుర్తిస్తే సత్వరం సరి చేసుకోవటం మంచిది. అవసరమైతే డాక్టర్‌నూ సంప్రదించాలి. గోరే కదాని నిర్లక్ష్యం చేయొద్దు.

# గోదావరి జిల్లాల సమాచారమ్

## పాడైన ఫ్రిజ్‌లు.. మురుగుపట్టిన థర్మాకోల్ డబ్బాల్లో పాలు



**కాకినాడ :** లైసెన్సులు కానరావు.. పాల నిల్వలో ఓ ప్రామాణికత లేదు.. పరిసరాలు చూస్తే అధ్వానం.. యథేచ్ఛగా పాల పొడి సైతం తయారుచేసేస్తున్న పరిస్థితి..కాకినాడ జిల్లాలో బుధవారం ఆహారభద్రత ప్రమాణాలశాఖ అధికారుల తనిఖీల్లో కనిపించిన పరిస్థితులివి. రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన నేపథ్యంలో కాకినాడ జిల్లాలో అధికారులు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజుల్లో కాకినాడ నగరం, గ్రామీణ మండలాల పరిధిలో ఆరు చోట్ల, తునిలో ఒకచోట పాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాలను పరిశీలించారు. పలు లోపాలను గుర్తించి నోటీసులు జారీచేశారు. అన్ని చోట్ల నమూనాలు సేకరించి నాణ్యత నిర్ధారణకు జేఎన్‌టీయూకే ల్యాబ్‌కు పంపించారు.

**తనిఖీలు ఎక్కడంటే..**

రావుగారు రైతు పాలు కేంద్రం(గాంధీనగర్), కేశవ మిల్క్ (సంత చెరువు), అన్నపూర్ణ మిల్క్ సప్లయర్స్, సాయి శ్రీనివాస్ మిల్క్స్ (ప్రతాప్ నగర్), సూర్యశ్రీ మిల్క్స్ (గైకోలుపాడు), మహాలక్ష్మి సన్ మిల్క్ (వాకలపాడు), రైతు పాల విక్రయ కేంద్రం (తుని)

**ఫ్రీజర్‌లో నేరుగా పోసి..**

పాలను క్యాన్లలో పోసి వాటిని ఫ్రిజ్‌లో పెట్టాలి. కొందరు నేరుగా ఫ్రీజర్‌లోనే పాలు పోసి నిల్వచేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు. వాటిని ఉపయోగించొద్దని అధికారులు సూచించారు. కొన్నిచోట్ల రైతుల నుంచి సేకరించిన పాలను ప్యాకెట్లుగా చేసి మురుగుపట్టి ఉన్న థర్మాకోల్ బాక్సుల్లో నిల్వ చేస్తున్నారు.

**వివరాలను ముందుగా చెప్పాలి..**

పాల విక్రయ కేంద్రాల వద్ద ఆవు/గేదె పాలు, వెన్నశాతం, తెలిపే బోర్డులుండాలి. మిల్క్ పౌడర్ వాడి పాలు చేస్తే చెప్పి విక్రయించాలి. ఉత్పత్తులు అమ్ముతున్నందున ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ తప్పనిసరి. ఏడుచోట్ల తనిఖీలు చేస్తే ఎక్కడా ఈ లైసెన్స్ లేదు. నాణ్యతలేని 5 కిలోల పాలపౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనల ఉల్లంఘనతో నోటీసులు జారీచేశారు. సహాయ నియంత్రకులు నందాజీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, ఎఫ్ఎస్‌వో కేశవప్రసాద్ తనిఖీల్లో పాల్గొన్నారు.

## బస్సు నడుపుతూ సొమ్మసిల్లిన డ్రైవర్



**తాళ్లరేవు :** ఆర్టీసీ బస్సు డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు పెనుముప్పు తప్పింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి యానాం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు మట్లపాలెం సమీపానానికి వచ్చే సరికి డ్రైవర్ గాడా నవీన్(25) కు కళ్లు తిరుగుతున్నట్లు అనిపించింది. పరిస్థితి అదుపుతప్పుతుందని గమనించిన అతను బస్సును రోడ్డు పక్కన నిలిపి సొమ్మసిల్లి స్టీరింగ్ వద్దనే పడిపోయాడు. ఆ సమయంలో బస్సులో సుమారు వందమంది సాధారణ ప్రయాణికులు, విద్యార్థులు ఉన్నారు. కండక్టర్ కరుణ, విద్యార్థులు ఆయనను తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించారు. కొంతసేపటికి ఆరోగ్యం కుదుటపడింది. విశ్రాంతి లేకపోవడంతో అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదాన్ని ముందే పసిగట్టి బస్సును రోడ్డు పక్కన సురక్షితంగా నిలివేయడంపై డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

## ఓయాసిస్ ఫెర్టిలిటీ కాకినాడ శాఖలో కాబోయే

## తల్లిదండ్రులకు ఘనంగా సీమంతం వేడుక



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** సంతాన సాఫల్యానికి దారితీసే ప్రయాణంలో ఉన్న కాబోయే తల్లులు వారి జీవిత భాగస్వాముల గౌరవార్థం ఓయాసిస్ ఫెర్టిలిటీ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సీమంతం వేడుక నిర్వహించారు. 16 సంవత్సరాల విశ్వాసంతో దేశవ్యాప్తంగా వంధ్యత్వ చికిత్సా రంగంలో సేవలందిస్తున్న ఈ సంస్థ, ఐయూఐ, ఐవీఎఫ్, కాపా ఐవీఎం, పీజీటీ, ఈఆర్ఏ, టీసా వంటి ఆధునిక చికిత్సా విధానాలతో పాటు సూక్ష్మ ద్రవ సాంకేతికత ఆధారిత వీర్యకణాల ఎంపిక, అండం వీర్యకణాల శీతల సంరక్షణ, సంతాన సామర్థ్యాన్ని మెరుగుపరిచే శస్త్రచికిత్సల ద్వారా అనేక దంపతుల తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తోందని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ సహ వ్యవస్థాపకులు వైద్య సంచాలకులు డా దుర్గా జి రావు మాట్లాడుతూ ప్రతి విజయ గాథ ఆశ నమ్మకం సంరక్షణకు ప్రతిబింబమని సంతానానికి దారితీసే చికిత్సల సహాయంతో తల్లిదండ్రులుగా మారే అనుభవం ప్రత్యేకమని పేర్కొన్నారు. ప్రధాన కార్యనిర్వాహణ అధికారి పుష్కరాజ్ షెనాయ్ మాట్లాడుతూ ఒకప్పుడు ఆశతో తమను ఆశ్రయించిన జంటలు నేడు తల్లిదండ్రులుగా మారడం సంస్థకు గర్వకారణమని తెలిపారు. కాకినాడ శాఖ వంధ్యత్వ నిపుణురాలు డా. రామినీడి దీప్తి ప్రియదర్శిని మాట్లాడుతూ సంతానోత్పత్తి సంరక్షణ కేవలం శాస్త్రసాంకేతికత మాత్రమే కాకుండా ఆశతో నిండిన కొత్త జీవితాల ఆవిర్భావమని, నేడు కాబోయే తల్లిదండ్రుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం తమకు గొప్ప బహుమతిగా భావిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా నాణ్యమైన వైద్య సేవలు రోగి కేంద్రిత సంరక్షణతో రీప్రొడక్టివ్ హెల్త్‌కేర్ రంగంలో సేవలను మరింత విస్తరించనున్నట్లు సంస్థ వెల్లడించింది.

## నీటి పరీక్ష కిట్లు.. ఉపయోగిస్తే ఒట్టు



**దేవరపల్లి :** నీటి కాలుష్యం కారణంగా ప్రబలుతున్న వ్యాధులను అరికట్టేందుకు, గ్రామీణులకు సురక్షిత నీటిని అందించడానికి ప్రభుత్వం పంచాయతీలకు అందించిన ఫీల్డ్ టెస్టింగ్ కిట్లు(ఎఫ్‌టీకే) వినియోగానికి దూరమై సచివాలయాల్లో మూలన దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 299 పంచాయతీలకు ఒక్కొక్కటి చొప్పున 2024 జనవరిలో ప్రభుత్వం వీటిని అందించింది. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో రోజు ట్యాంకుల్లో నీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేయాలన్నది లక్ష్యం. మరో 15 రోజుల్లో ఈ కిట్ల వినియోగ కాలపరిమితి ముగియనుండగా.. చాలా పంచాయతీల్లో నేటికీ ఒక్కసారి కూడా వినియోగించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**అక్కడక్కడ మాత్రమే..**

ఈ కిట్లతో పీహెచ్, అల్కలినిటీ(క్షార గుణసాంద్రత), సంపూర్ణ కఠినత్వం, క్లోరైడ్, నైట్రేట్, ఫ్లోరైడ్, ఇనుము, రెసిడ్యూల్, ఫ్రీక్లోరిన్ పరీక్షలు చేయాల్సి ఉండగా మండలంలో ఒకటి రెండు పంచాయతీల్లో మినహా ఎక్కడా ఆ దిశగా జరగడం లేదు.

**ఇలా చేయాలి**

వారంలో ఒక రోజు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతి గృహాల్లో నీటి పరీక్షలు నిర్వహించాలి. లోపాలుంటే ఆర్‌డబ్ల్యూఎస్ పల్స్ సర్వేయాప్‌లో నమోదు చేయాలి. క్లోరినేషన్ చేసిన తర్వాత పరీక్ష ఫలితాలను పీఆర్-1 యాప్‌లో పొందుపరచాలి. తాగునీటి నాణ్యత విషయంలో లోపాలు అధికంగా ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వచ్చి నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఇదీ పరిస్థితి

దేవరపల్లి మండలం దుద్దుకూరు పంచాయతీకి అందించిన ఫీల్డ్ టెస్టింగ్ కిట్(ఎఫ్‌టికె) సచివాలయంలో ఓ మూలన దర్శనమిస్తోంది. కృష్ణంపాలెం, ధుమంతునిగూడెం, రామన్నపాలెం పంచాయతీల్లో ఒకటి మాత్రమే ఉపయోగిస్తున్నారు. పల్లంట్ల పంచాయతీకి అందించిన కిట్‌లోని పరికరాలను కనీసం పది శాతం కూడా ఉపయోగించలేదు. కురుకూరు సచివాలయంలో కాలం చెల్లిన కిట్ కనిపిస్తోంది. కొత్తగా అందించిన కిట్‌లో నైట్రేట్-బి 100 మాత్రలు ఇవ్వగా రెండేళ్లలో కేవలం ఆరు మాత్రమే ఉపయోగించారు. మరో 10 రోజుల్లో ఈ కిట్ కాలపరిమితి ముగియనున్నది. 'గ్రామీణస్థాయిలో నీటి పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత పంచాయతీ రాజ్‌శాఖదే. సరఫరా చేస్తున్న నీటిలో లోపాలుంటే ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తాం.' అని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బి.వి.గిరి అన్నారు.

## జనం గొంతు తడపని జల్‌జీవన్ మిషన్



**ద్రాక్షారామ :** ద్రాక్షారామలోనే కాదు కాకినాడ జిల్లాలోనూ అదే పరిస్థితి. ఇటీవల జడ్పీ సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో పాటు మరికొందరు సభ్యులు జేజేఎం పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. గత వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయలేదు. కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో రూ.328 కోట్లు ఖర్చుచేసినా తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. కొందరు గుత్తేదారుల జేబులు నిండాయే తప్ప జనం గొంతు తడపలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులపై దృష్టిపెట్టింది. వాటర్ గ్రిడ్‌తో అనుసంధానం చేసి ఇబ్బందులు తొలగించేందుకు అడుగులు వేస్తున్నారు. ఈ సమాచార బోర్డులో ద్రాక్షారామ పంచాయతీ పరిధిలోని ఆదివారపుపేటలో రూ.42.63 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పనులు చేసినట్లు చూపించారు. 2023 డిసెంబర్‌లో గుత్తేదారుతో ఒప్పందం చేసుకుని 2024 మే 15 నాటికి పని పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. రక్షిత పథకం నుంచి పైపులైన్ విస్తరణ, 273 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు చూపారు. బోర్డులో పేర్కొన్న పనులకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి చాలా వ్యత్యాసం ఉంది. ఇంటి ముంగిట మూడు అడుగుల ఎత్తులో చిన్న కుళాయి దిమ్మ నిర్మించి కనెక్షన్ ఇవ్వాలి. ప్లాస్టిక్ పైపులు వేలాడదీసి వదిలేశారు. వాటి నుంచీ నీళ్లు ఇవ్వలేదు. నిధులు మాత్రం ఖర్చయ్యాయి. ఆదివారపుపేట కాలనీలో ఇంటింటా ఇలా పైపులు వేలాడదీసి వదిలేశారు. కాకినాడ గ్రామీణం గంగనాపల్లిలో జల్‌జీవన్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. పైపులు తెచ్చి సచివాలయం ఎదుట పడేశారు. పెదపూడి మండలంలో 38 పనులు మంజూరు చేస్తే 16 పూర్తిచేసినట్లు చూపినా వాటిలో సగం కూడా నీటిని అందించడంలేదు. పిఠాపురం మండలం బోగాపురం, చిత్రాడ, పి.తిమ్మాపురం, నవఖండ్రవాడ, రాపర్తిలో పనులు అసంపూర్తిగా నిలిచాయి. గొల్లప్రోలు మండలం దుర్గాడ, వన్నెపూడి, తాటిపర్తి గ్రామాలకు మంజూరు చేసిన పనుల్లో చాలా మొదలుకాలేదు. చినజగ్గంపేట, ఏపీ మల్లవరంలో నిలిచాయి. పెద్దాపురం మండలంలో 47 పనులకు 30 పూర్తిచేసినట్లు చూపిస్తున్నారు. కొన్ని రక్షిత నీటి పథకాలకు వనరులు లేక ఉత్సవ విగ్రహాల్లా కనిపిస్తున్నాయి.

**త్వరలో పూర్తిచేయిస్తాం..**

అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తిచేయిస్తాం. రూ.56 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వం త్వరలో విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. గతంలో చేపట్టిన పనులపై ఫిర్యాదులేవీ రాలేదు. వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

## ఆహార భద్రత గాలికి - ఉనికిలేని తనిఖీ



**అమలాపురం :** అమలాపురానికి చెందిన ఓ వ్యక్తి పెళ్లి రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో హోటల్‌లో భోజనం చేశారు. ఇంటికి వెళ్లే సరికి వారిలో ఇద్దరు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు ఫుడ్ పాయిజన్ అయినట్లు నిర్ధారించారు. వారం రోజుల పాటు చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమలాపురం గడియార స్తంభం కూడలి సమీపంలోని ఓ హోటల్‌లో తమకు పాచిపోయిన చికెన్ బిర్యానీ పెట్టారని యువకులు బుధవారం పెట్టిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. రాజమహేంద్రవరంలో పాలకల్తీ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తగా పాల విక్రయ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇతర జిల్లాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నా.. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం తూతూమంత్రంగానే జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో పదుల సంఖ్యలో విక్రయ కేంద్రాలు ఉన్నా.. బుధవారం ఆహార భద్రతాధికారులు ఒక దుకాణంలో మాత్రమే పరిశీలన చేయడం గమనార్హం. దీనిపై ఆహార భద్రతాధికారి రామయ్య మాట్లాడుతూ మార్గదర్శకాలు వచ్చే సరికి ఆలస్యం కావడంతో పూర్తి స్థాయిలో తనిఖీలు సాధ్యం కాలేదన్నారు. వారం రోజుల్లో జిల్లాలోని అన్ని విక్రయ కేంద్రాలను పరిశీలించి నమూనాల సేకరణ పూర్తి చేస్తామన్నారు.

**జరిమానాతో సరి..**

ఏడాదికి రూ.12 లక్షలు మించి టర్నోవర్ చేస్తున్న పాల వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ, పట్టణాల్లో పురపాలిక అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. ఆహార భద్రతా అధికారుల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఇవేమీ లేకుండానే చాలా మంది నిర్భయంగా వ్యాపారం చేస్తున్నారు. ఏదైనా హోటల్‌లో ఆహార నాణ్యతపై ఆరోపణలు వస్తే తనిఖీలు చేస్తున్నారు. నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతున్నారు. వంటశాల, ఇతర పరిసరాల్లో పారిశుధ్యం సరిగా లేదని నామమాత్రపు జరిమానా విధించి వదిలేస్తున్నారు. నాణ్యత సక్రమంగా పాటించని వారికి అనుమతులు రద్దు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ ఆగడాలు అదుపులోకి వచ్చే పరిస్థితి లేదు.

**జిల్లా కమిటీ ఎక్కడ...?**

హోటళ్లు, ఆహార పదార్థాలు విక్రయించే కేంద్రాలపై తనిఖీలు చేపట్టేందుకు జేసీ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి వారం తనిఖీలు చేపట్టి, నాణ్యత పాటించని వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినా.. చర్యలు మాత్రం కానరావడం లేదు. ఈ కమిటీ ఏర్పాటు అలంకారప్రాయంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫిర్యాదు వస్తే చర్యలు**

హోటళ్లు, ఆహార పదార్థాలు విక్రయించే కేంద్రాల్లో నాణ్యత లేనివి, పాడైనవి, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం. అమలాపురంలో హోటల్ విషయం మా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

**రామయ్య, ఆహార భద్రతాధికారి**

## సహకార ఉద్యోగుల సమ్మె విరమణ



**ఆల్కాట్‌తోట :** సహకార ఉద్యోగుల జీతాలు 20 శాతం పెంపు, గ్రాట్యూటీని రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచడంతో పాటు, ప్రతి ఉద్యోగికి రూ.5 లక్షల కవరేజీతో సమగ్ర గ్రూప్ హెల్త్ ఇన్స్యూరెన్స్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో సమ్మె విరమించినట్లు ఏపీ రాష్ట్ర సహకార ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరంలోని డీసీసీబీ బ్రాంచ్ వద్ద జరిగిన సహకార ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. పీఏసీఎస్ ఉద్యోగులకు ప్రకటించిన ప్రయోజనాల అమలు విధానాలను ఉన్నత స్థాయి కమిటీ అతి త్వరలో ప్రకటిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారన్నారు. పీఏసీఎస్ యూనియన్లకు సంబంధించిన ఇతర డిమాండ్లను కూడా కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనుందన్నారు. ఉద్యోగులు ఎటువంటి అపోహలకు, అధైర్యానికి గురి కాకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కె.వీరభద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రామచంద్రరావు, డైరెక్టర్లు బి.సత్యనారాయణ, ఎస్.అప్పారావు, బి.రాంబాబు పాల్గొన్నారు.

## కల్తీ పాల ఘటన.. బాధితుల హెల్త్ బులిటెన్ విడుదల



**తూర్పుగోదావరి :** రాజమండ్రి కల్తీ పాల ఘటనలో వివిధ ఆసుపత్రిలో 15 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బాధితుల పరిస్థితిపై ఆసుపత్రి యాజమాన్యం తాజాగా హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. బాధితులకు చికిత్స కోసం యాంటీడోట్ తెప్పించామని అధికారులు చెబుతున్నారు.

ఈ క్రమంలో వెంటిలేటర్‌పై ఇద్దరు, ముగ్గురికి డయాలసిస్, మరో ముగ్గురిని వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్, ఏడుగురిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్టు సిబ్బంది చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో పాలలో ఏ పదార్థాలు కలిశాయో ఇప్పటివరకు ల్యాబ్ రిపోర్టులో స్పష్టం కాలేదు. ల్యాబ్ రిపోర్ట్ రాకుండా యాంటీ డోట్ ఎలా ఇస్తారో అర్థం కాని పరిస్థితిలో బాధిత కుటుంబాలు ఉన్నాయి. చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఇద్దరికి అనూరియా లక్షణాలు బయటపడ్డాయి.

ఇదిలా ఉండగా.. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి 21 మంది ఆస్పత్రుల్లో చేరగా.. ఇప్పటికే ఆరుగురు మృతి చెందిన విషయం విదితమే. ప్రస్తుతం 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది.

**రక్త నమూనా నివేదికలు వచ్చేదెప్పుడో!**

నగరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాల్లో 110 కుటుంబాలకు కోరుకొండకు చెందిన గణేష్ పాలు పోశారు. ఈ కుటుంబాల పరిధిలో 315 రక్త నమూనాలు తీసుకున్నారు. పాల శీతలీకరణ యంత్రంలో లీకేజీ ఏర్పడి ఇథలీన్ గ్లైకాల్ పాలలో కలిసి ప్రమాదం జరిగిందంటూ ఆ పాలను, అస్వస్థతకు గురైన వారి రక్త నమూనాలు పరీక్షల నిమిత్తం ముంబైలోని ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపారు. బాధితులకు అత్యవసరంగా ఇవ్వాల్సిన ఇంజెక్షన్లను రూ.లక్షలు వెచ్చించి ముంబై నుంచి హుటాహుటిన రప్పించారు.

అయితే.. ఆ ఇంజెక్షన్లు నిరుపయోగంగా ఉన్నాయి. కల్తీపాలు తాగి ఆస్పత్రి పాలైన బాధితుల శరీరంపై ఇథలీన్ గ్లైకాల్ ప్రభావం ఉంటే మాత్రమే ఆ ఇంజెక్షన్లు చేయాలి. అలా కాకుండా కల్తీ జరిగి ఉంటే ఈ ఇంజెక్షన్లు పనిచేయవు. రక్త నమూనాలకు సంబంధించిన ల్యాబ్ రిపోర్టులు రావడంలో జాప్యం జరుగుతుండటంతో ఆ ఇంజెక్షన్లు ఉపయోగించలేని పరిస్థితి. ఈ సందిగ్ధ స్థితి బాధితులకు ప్రాణ సంకటంగా మారుతోంది. పాల కల్తీపై నేటికీ స్పష్టత రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**తిరుపతి ల్యాబ్‌కు రక్త నమూనాలు**

ముంబై ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి రిపోర్టులు రావడం ఆలస్యం అవుతుండటంతో అధికారులు బాధితుల నుంచి మరోసారి రక్త నమూనాలు సేకరించి తిరుపతిలోని ల్యాబ్‌కు పంపారు. వాటి నివేదిక గురువారం సాయంత్రానికి అందే అవకాశం ఉంది. దానిని బట్టి వైద్యం ఏవిధంగా చేయాలో నిర్ణయిస్తారు.

## రూ.11 వేల జరిమానా

**అమలాపురం :** అమలాపురంలోని ఏబీసీడీ ఫుడ్ కోర్టు (హోటల్)లో నిల్వ మాంసంతో ఆహారం పెట్టారంటూ వచ్చిన ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ బుధవారం ఆ హోటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిపై ఒక వినియోగదారుడు మంగళవారం రాత్రి మున్సిపాలిటీ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఆ హోటల్‌ను తొలుత మున్సిపల్ ఇన్విరాల్‌మెంట్ ఏఈ వెంకటేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, సిబ్బంది తనిఖీ చేశారు. లోపల పలు విభాగాల్లో అపరిశుభ్రత ఉందని పేర్కొంటూ హోటల్ యాజమాన్యానికి రూ.వెయ్యి జరిమానా విధించారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామయ్యతో మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో జరిగిన పాలు కల్తీ ఘటన నేపథ్యంలో కోనసీమ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామయ్య అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ రంగంలోకి దిగి ఏబీసీడీ ఫుడ్ కోర్టును స్వయంగా తనిఖీ చేశారు. ఫుడ్ కోర్టులో అపరిశుభ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఫుడ్ కోర్టులో నూనెను రీయూజ్డ్ చేస్తున్నారని, మాంసాన్ని ఫ్రిజ్‌ల్లో ఉంచి వాడుతున్నారని, మసాలా దినుసుల ప్యాకెట్లపై ఎఫ్ఎస్ఎస్ఐ ముద్ర లేదని గుర్తించారు. ఈ తప్పిదాలపై అధ్యయనం చేసిన కమిషనర్.. హోటల్ యాజమాన్యానికి రూ.10 వేలు జరిమానా విధించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య తనిఖీ

అమలాపురంలోని ఏబీసీడీ ఫుడ్ కోర్టు హోటల్‌ను జిల్లా



ఫుడ్ సేఫ్టీ అదికారి వై.రామయ్య బుధవారం రాత్రి తనిఖీ చేశారు. అక్కడి మాంసాహార పదార్థాల శాంపిల్స్ సేకరించారు. వాటిని హౌదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

## ఉదయ అక్షరం రిపోర్టర్ కోటేశ్వరరావు ను పరామర్శించిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు.





**విశాఖ సమాచారం తాళ్లపూడి :** తాళ్లపూడి మండలం లో జర్నలిస్టుగా సేవలందిస్తున్న ఉదయ అక్షరం రిపోర్టర్ గంటా శ్రీరామ కోటేశ్వరరావు కు మాతృ యోగం జరిగింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోటేశ్వరరావు తల్లి శుక్రవారం తుది శ్వాస విడిచారు. మరణ వార్త తెలుసుకున్న నియోజకవర్గంలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు అధికారులు కోటేశ్వరావు నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించి ఆయన తల్లి గంటా రాజేశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ,వంబోలు పోసిబాబు, తోట రామకృష్ణ, గూడా విజయరాజు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, యాళ్ళ బాబురావు, కంకిపాటి బాబురావు, యెల్లిన శ్రీనివాస్, పుప్పాల సత్యనారాయణ, ఐతం మణికంఠ, జన్నిపల్లి మణి, సత్తిబాబు, కవల నాగేశ్వరరావు, నరాలశెట్టి బొండియ్య,గండి రాంబాబు,
పిట్టా శ్రీనివాస్, ప్రసాద్, చెవ్వూరి రాము, నామా ప్రకాశం, కైగాల శ్రీనివాస్, అంబటి కృష్ణ, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, ఉప్పులూరి రమేష్, మద్దుకూరి శంకర్, కొసన శివ, రాజ్ కుమార్,గణేష్, పప్పుప్పల నాని, వల్లభశెట్టి శ్రీను, విత్తం నాని, ధాకే రాజు, కొమ్మిరెడ్డి పరశ రామారావు, దేవన సత్తిబాబు, లింగంపల్లి సుధీర్, బరిగంటి శీను, సంఘటి రాము తదితరులు ఉన్నారు.

## శాస్త్రీయ పరిశోధనల్లో పురోగతిపై ఏయూలో రెండు రోజుల జాతీయ సింపోజియం

**-శతాబ్ది ఉత్సవాలు, జాతీయ సైన్స్ వేడుకల్లో భాగంగా నిర్వహణ**

**-2 నుంచి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్(మెన్) కాంపిటీషన్**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖసమాచారం :** శాస్త్రీయ పరిశోధనల్లో పురోగతిపై ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 27,28 తేదీలలో రెండు రోజుల జాతీయ సింపోజియంను నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. గురువారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సదస్సులో పాల్గొనడానికి 9 మంది నిపుణులు వస్తున్నారని, వీరిలో 4 భట్నాగర్ అవార్డు గ్రహీతలు ఉన్నారన్నారు. మార్చి 5న రూ 10 కోట్ల వ్యయంతో ఏర్పాటైన అరబిందో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ప్రారంభిస్తామన్నారు. ఏయూ ఆచార్యులుగా పనిచేసి విభిన్న విశ్వవిద్యాలయాలకు వీసీలుగా పనిచేసిన ఆచార్యులతో త్వరలో ప్రత్యేకంగా ఒక ప్రత్యేక ప్యానెల్ డిస్కషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఏయూ మౌళిక వసతులు, ప్రయోగశాలలు పరిచయం చేస్తూ సమ్మర్ ఇంటర్న్ షిప్పు అందించడానికి నిర్ణయించామన్నారు. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అణ్వేషన్ అనే ప్రత్యేకమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. శతాబ్ధి ఉత్సవాలను వారం రోజులు నిర్వహించే విధంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసామని, త్వరలో వాటి వివరాలు సైతం తెలియజేస్తామన్నారు. ఏయూలో రెండు రోజుల జాతీయ సింపోజియం...

ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి. ఆర్ రాజు మాట్లాడుతూ...27వ తేదీ ఉదయం 10 గంటలకు బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ కేంద్రంలో తొలిరోజు సదస్సును ప్రారంభిస్తామన్నారు. ఐఐటి మద్రాసు ఆచార్యులు ఎం. రామచంద్ర రావు, ఎస్.వి యూనివర్సటీ వీసీ ఆచార్య తాతా నర్సింగ రావు, ఐఐఎస్సీ ఆచార్యులు ఆచార్య కవిరాయని ప్రసాద్, ఆచార్య అపూర్వ ఖరే, ఐఐటి గౌహతి ఆచార్యులు రాఖి చతుర్వేది, ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్లు వివిధ అంశాలపై ప్రసంగాలు అందిస్తారు. అనంతరం లఘుచిత్ర ప్రదర్శన, స్కిట్ ప్రదర్శనతో తొలిరోజు కార్యక్రమాలు ముగిస్తారు. రెండవ రోజు ఏయూ పరిపాలనా భవనం నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థులతో ర్యాలీ ప్రారంభించి, ఏయూ భౌతిక శాస్త్ర విభాగంలో సి.వి రామన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద ప్రత్యేక బెలూన్ను ఎగురవేస్తారు. కన్వెన్షన్




సెంటర్ వద్ద రెండవ రోజు కార్యక్రమాలలో భాగంగా ఐఐటి కాన్పూర్ పూర్వ ఆచార్యులు ఎస్.అనంతరామకృష్ణ, ఆచార్య అభిజిత్ ముఖర్జీ, ఐజర్ తిరుపతి ఆచార్యులు కె.శ్రీనివాస్, ఐఐటి మద్రాస్ ఆచార్యులు వీటూరి శ్రీనివాస్ల ప్రసంగాలు ఉంటాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, బెస్ట్ రీసెర్చ్ పోస్టర్ ప్రజెంటేషన్ అవార్డులను ప్రధానం చేస్తామన్నారు.

**ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సటీ బెస్ట్ ఫిజిక్ (మెన్) కాంపిటీషన్స్....**

ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా మార్చి 2-4 తేదీలలో ఏయూ వేదికగా ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ (మెన్) కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్. విజయ్ మోహన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 120 విశ్వవిద్యాలయాల నుంచి 500 బాడీబిల్డర్లు, 200 కోచ్లు, సాంకేతిక సిబ్బంది, న్యాయ నిర్ణేతలు హాజరవుతారన్నారు. 8 విభాగాలలో 24 మందిని విజేతలుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏయూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు.

**విదేశీ విద్యార్థుల ఫెస్టివల్...**

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 55 దేశాలకు చెందిన 1100 మంది విదేశీ విద్యార్థులను శతాబ్ది ఉత్సవాలలో భాగస్వాములను చేస్తూ ప్రత్యేకంగా ఫుడ్ ఫెస్టివల్, కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య పాల్ డగ్లస్ తెలిపారు. విదేశీ విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార రుచులను, కళలను ఈ కార్యక్రమాలలో పరిచయం చేస్తారన్నారు.

ఈ విలేఖరుల సమావేశంలో రెక్టర్ ఆచార్య పి.కింగ్, ఆచార్య సంధ్య దీపిక, ఆచార్య శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ స్కానింగ్ శిబిరం..



**అరకు లోయ విశాఖ సమాచారం :** మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, మరియు ఈస్ట్ కోస్ట్ రైల్వే హెల్త్ యూనిట్ సహకారంతో ఈరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అరకు లోని ఈస్ట్ కోస్ట్ రైల్వే హెల్త్ యూనిట్ వద్ద ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్, ఈస్ట్ కోస్ట్ రైల్వే డాక్టర్ వి కన్నా హాజరయ్యారు కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వెంకట సాంబశివరావు రోగులను పరీక్షించనున్నారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, ఈసీజీ మరియు మహిళల కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించరూ.

## పలు గ్రామాలు కి సుడిగాలి పర్యటన....



**అరకులోయ (విశాఖ సమాచారం ):** జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్. అనంతగిరి మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. గురువారం ఉదయం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగముచే చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను,పనుల ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతగిరి మండలం, పెద్దబిడ్డ పంచాయతీ నందు డముకు - నిమ్మల పాడు నుండి పెద్దబిడ్డ వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు,రోడ్డు పొడవు 2.10ఎ౦, ప్రస్తుతం వెట్ మిక్స్ లేయర్ వరకు పూర్తి కాబడిన పనులు రోలింగ్ చేయుటకు సిద్ధంగా ఉన్న పనులను పరిశీలించారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి తారు రోడ్డు వేయాలని ఆదేశించారు. అదే మండలానికి చెందిన గుమ్మ పంచాయతీ నందు గుమ్మ నుండి చీడివలస వరకు, నిమ్మవూట, మిర్తుతుంగడ, మద్దిపాడు, బూరుగుల పాడు, కరకవలస, బూసిపాడు, పొర్లువలస మీదుగా నిర్మితమవుతున్న తారు రోడ్డు నిర్మాణం పనులను, రోడ్డు పొడవు 11 కిలోమీటర్లు కాగ ప్రస్తుతం కిలోమీటర్లు వెట్ మిక్స్ లేయర్ 6 కిలోమీటర్ల జి ఎస్ బి లేయర్ వరకు పూర్తి కాబడిన పనులను రోలింగ్ జరుగుతున్న పనులు పరిశీలించారు. వాటిని వీలైనంత త్వరితగతిన తారు రోడ్డు వేయాలని ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న రోడ్ల పనుల లేయర్ల తీక్నెస్ ను రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు.ఈ రోడ్డు వేయుట వలన జరుగుతున్న లబ్ధిని గూర్చి గ్రామస్థులతో చర్చించారు, ఈ రోడ్డు వేయుట వలన చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, నూతన సెల్ టవర్ నిర్మాణ పనులను ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పెద్ద వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు కల్వర్టు అప్రోచ్ ల వద్ద రోడ్డు కొట్టుకు పోకుండా, జజ ర్యాంప్ వేయుట మరియు స్టోన్ ప్యాకింగ్ వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి వివరాలని అడిగి తెలుసుకున్నారు.


అనంతగిరి మండలం, చెరుకు బిడ్డ గ్రామం లో ఎంపీపీ స్కూల్ ను పరిశీలించి పిల్లలతో ముచ్చటించి, పిల్లల విద్య బోధనపై ఆరా తీశారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. వేణు గోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.అభిషేక్,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.గణేష్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మసకబారుతున్న ఏయూ ప్రతిష్ట



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** మహారాణిపేట రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీ పరువు దిగజారిపోతోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగం నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, ఉరుకూటి చందు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు చంద్రబాబు ప్రభుత్వం, ఏయూ వీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ తరుణంలో, కావాలనే వర్సిటీ ప్రతిష్టను దిగజార్చేలా కూటమి పాలకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడు శ్రీవత్సవ్ ఆరోపించారు. గత 20 నెలలుగా క్యాంపస్‌లో ఏదో ఒక సమస్య సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల క్యాంపస్‌లో ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణలను గుర్తుచేశారు. విద్యార్థుల మధ్య చిన్న చిన్న వివాదాలను నాలుగు గోడల మధ్య పరిష్కరించాల్సిన యాజమాన్యం, వీసీ.. చోద్యం చూస్తూ కూర్చున్నారని విమర్శించారు. వివాదం ముదిరిన తర్వాత స్వయంగా పోలీస్ కమిషనర్ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేయాల్సి రావడం వర్సిటీ చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా గీతం కాలేజీకి 54.9 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కట్టబెట్టేందుకు సిద్ధపడటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, ఏయూ ప్రతిష్టను కాపాడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉత్తరాంధ్ర జోనల్ ప్రెసిడెంట్ అంబటి శైలేష్, జిల్లా విద్యార్థి విభాగం ప్రెసిడెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి







**- సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి**

**- మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి**

**- విద్యార్థులు అందరూ గ్రీన్ సోల్జర్స్ గా తయారు అవ్వాలి**

**-జెవి రత్నం , వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ**

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** చెత్త రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. గురువారం ఉదయం మధురవాడ దగ్గర మిధిలాపురిలోని గ్లోబ్ విద్యా సంస్థలో ప్రిన్సిపాల్ లలిత అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లో భాగంగా "చెత్త రహిత పరిపాలన" (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మన విశాఖ నగరంలో ఎక్కడా చెత్త పారవేయరాదని, జి వి ఎంసి వాహనాలకు చెత్త ఇవ్వాలని కోరారు. మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి అని వివరించారు. ఏ జీవి అంతరించినా మానవాళి మనుగడే ప్రమాదం లో పడుతుంది అన్నారు. విద్యార్థులు అందరూ పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత కోసం గ్రీన్ సోల్జర్స్ గా తయారు అవ్వాలి అని పిలుపునిచ్చారు. విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కృషి చేయాలని కోరారు. మన అందమైన నగరాన్ని ఒక సుందరమైన వనంగా తీర్చి దిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, గ్రీన్ వాలంటీర్ ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు

## మండలంలో విస్తారంగా మొక్కజొన్న సాగు



**సాలూరు విశాఖ సమాచారం :** సాలూరు పాచిపెంట మండలాల పరిధిలో మొక్కజొన్న సాగు రైతులు విస్తారంగా రబి. సీజన్లో మొక్కజొన్న పంటలు పండిస్తూ ఉన్నారు మొక్కజొన్న రెండవ పంట మంచి దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు సూర్యనారాయణ కొండలరావు బుషి చెన్నారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో మొదటి పంట పత్తి వేసి రెండు పర్యాయములు పత్తి పంట వచ్చిన తరువాత పత్తి పంట రోటవేటర్తో పత్తి మొక్కలను కట్ చేసి పది దినాలు పోయిన తర్వాత అవి సేంద్రియ ఎరువుగా తయారవుతుందని రైతులు తెలిపారు దుక్కులు దున్నే రెండవ పంట డిసెంబర్ నెల రెండవ వారం మొక్కజొన్న విత్తనాలు నాటితే అధిక దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు మొక్కజొన్న పంట 120 రోజులకు పంట వస్తుందని రైతులు తెలిపారు 20 రోజులకు యూరియా డిఎపి వేస్తామని 40 రోజులకు 20 20 0 ఎరువులు వేయాలని మూడవ దశ 60 రోజులకు ఫాటోస్ యూరియా ఎరువు వేస్తే కంకి దృఢముగా వచ్చి అధిక దిగుబడులు రావడం జరుగుతుందని రైతులు తెలిపారు ఈ విధముగా మొక్కజొన్న పంట పండిస్తే ఎకరానికి 40 కింటీలాల్. దిగుబడి వస్తుందని ఎకరానికి మొక్కజొన్న పంట 80 వేలు రూపాయలు వస్తుందని పెట్టుబడి 40 వేలు పొగ ఎకరానికి 40 వేలు రూపాయలు మిగులుతుందని రైతులు తెలిపారు

## నిధులు చాలవు పనులు సాగవు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** జిల్లాలోని జలవనరుల్లో ప్రధానమైన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ నిధుల గండం నుంచి గట్టెక్కలేకపోతోంది. పనులు ప్రారంభించి రెండు దశాబ్దాలు గడిచినా సగం కూడా పూర్తి చేసుకోలేకపోయింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా కూడా నిధులు విదల్చకపోవడంతో అడుగైనా ముందుకు కదల్లేదు. నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని మూడు మండలాల్లో 49 గ్రామాల పరిధిలోని 24,710 ఎకరాలకు సాగునీరు.. విజయనగర వాసులకు తాగునీరు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇంతటి ప్రాధాన్యమున్నా.. నేతల చర్యలతో ఈ పరిస్థితి దాపురించింది. శంకుస్థాపనతో సరి 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేకంగా నీటి తరలింపునకు రూ.198 కోట్ల అంచనాతో చేపట్టే పనులకు, విమానాశ్రయ నిర్మాణంతో పాటు శంకుస్థాపన చేశారు. గద్దె దిగేవరకు నిధులివ్వలేదు. పనులు చేయబోమంటూ తప్పుకొనేందుకు సిద్ధపడిన గుత్తేదారులను కూటమి ప్రభుత్వం నచ్చజెప్పి కొనసాగించేలా చేసింది. ఆ పనులకు మళ్లీ రూ.50 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. 225 ఎకరాలు సేకరించేదెప్పుడు? 2005 ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.220.04 కోట్లు. రెండు సార్లు సవరణతో 2025 ఫిబ్రవరి నాటికి రూ.808.34 కోట్లకు చేరింది. ఈ ఏడాదికి రూ.900 కోట్లు దాటింది. పూర్తయ్యే నాటికి రూ.వెయ్యి కోట్లకు చేరే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తికి 3,497.58 ఎకరాలు అవసరం. ఇంతవరకు 3272.32 ఎకరాలు సేకరించారు.

సగమైనా పూర్తి కాలేదు దీన్ని ప్రారంభించిన ఇరవై ఏళ్లలో సగం కూడా పూర్తి కాలేదు. నిర్వహణ నిధులకూ నోచుకోలేకపోతోంది. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లోనూ పురోగతి లేదు. ఇలాగే కొనసాగితే మరో 20 ఏళ్లు పట్టేటట్లు ఉంది. ఇప్పట్లో పునరావాసం కలిగేనా! పునరావాస ప్రక్రియ ప్రధాన అవరోధమైంది. కోరాడపేట, ఏటీ అగ్రహారం, పడాలపేట గ్రామాల వారికి గూడు కల్పనలో జాప్యమవుతోంది. ఈ మూడు గ్రామాలను తరలించి, 810 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. పాత ధరల ప్రకారం వీరికి రూ.97.18 కోట్లు.. తాడిపల్లి, కుదిపి, నీలంపేట నిర్వాసితుల పరిహారానికి రూ.75.68 కోట్లు చెల్లించాలి. అప్పుడే పనులకు నిర్వాసితులు సహకరించే అవకాశముంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.68 కోట్లు ఇటీవల బడ్జెట్‌లో కేటాయించారు. పనులకు రూ. 35 కోట్లు, భూసేకరణకు రూ.28 కోట్లు, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.5 కోట్లు ఇచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ కింద రూ.172.86 కోట్లు అవసరమని ప్రతిపాదించగా, కేవలం రూ.5 కోట్లు మంజూరు చేస్తామనడంతో అధికారులు తలపట్టుకుంటున్నారు.

## షాప్ యజమానులు వ్యర్థ పదార్థాలు డస్ట్ బిన్ లో వేయండి



**సాలూరు విశాఖ సమాచారం:** సాలూరు పట్టణ పరిధిలో ఉన్న షాపు యజమానులు వ్యర్థ పదార్థాలను డస్ట్ బిన్ లో వేయాలని సాలూరు మున్సిపల్ కమిషనర్ టి రత్నకుమార్ తెలిపారు గురువారం సాయంత్రం పట్టణంలో ఉన్న షాపులను పరిశీలించి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని షాపు యజమానులకు అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరు పరిసర ప్రాంతాలను శుభ్రముగా ఉంచుకోవాలని అన్నారు పట్టణంలో ప్రతి మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో సేనటి ఇన్స్పెక్టర్ ఎల్ బాలకృష్ణ మున్సిపల్ సిబ్బంది మెయిన్ రోడ్ లో ఉన్న షాపు యజమానులకు అవగాహనకలిపించారు.

# క్రీడా సినిమా సమాచారం

## బ్లడీ ఫైర్ స్టార్టర్..బ్లడీ రోమియో నెం.1 గ్యాంగ్‌స్టర్!




బ్యాక్ టు బ్యాక్ విభిన్నమైన కథలని ఎంచుకుంటూ కొత్త తరహా సినిమాలకు శ్రీకారం చుడుతున్నారు నేచురల్ స్టార్ నాని. గత ఏడాది -హిట్:ది థర్డ్ కేస్-తో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని మాస్, క్లాస్ ఆడియన్స్‌ని ఆకట్టుకున్న నాని ఈ ఏడాది మాస్ ప్రేక్షకుల్నే టార్గెట్ చేసినట్టున్నాడు. రెండు క్రేజీ మాసీవ్ యాక్షన్ డ్రామాలతో అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేయబోతున్నాడు. -దసరా- ఫేమ్ శ్రీకాంత్ ఓదెలతో -ది ప్యారడైజ్- మూవీతో, సరికొత్త గెటప్‌తో రూపొందుతున్న రా అండ్ రస్టిక్ ఫిల్మ్‌తో ఆడియన్స్‌ని ఆకట్టుకోవడానికి రెడీ అవుతున్నాడు. దీనితో పాటు మరో క్రేజీ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానుల్ని -ఓజీ- మూవీతో థ్రిల్ చేసిన యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ సుజీత్ డైరెక్షన్‌లో స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాని చేస్తున్న విషయం తెలిసిందే. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయినపల్లి ఈ మూవీని నిర్మిస్తున్నారు. గురువారం (ఫిబ్రవరి 24) నేచురల్ స్టార్ నాని పుట్టిన రోజు సందర్భంగా టైటిల్‌ని ప్రకటిస్తూ బ్లడ్ ఫైర్ స్టార్టర్ అంటూ ఓ అనౌన్స్‌మెంట్ వీడియోని రిలీజ్ చేశారు. ఈ మూవీకి ముందు నుంచి వినిపిస్తున్న -బ్లడీ రోమియో- అనే టైటిల్‌ని ఫైనల్ చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సినీ లవర్స్‌ని, నాని అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో నాని గ్యాంగ్ స్టర్‌గా కనిపించనున్నాడు. యూనిమేటెడ్ ఏఐ వీడియో ఆసక్తికరంగా సాగుతూ సినిమా ఎలా ఉండబోతోందనే క్లారిటీ ఇచ్చింది. గ్యాంగ్ స్టర్స్ డెన్ ని చూపిస్తూ ..ఎలా జరిగింది? షూటింగా.. అని ఓ వ్యక్తి అడిగితే వెన్నెల కిషోర్ -కాదు కూకింగ్- అనే వాయిస్‌తో దీన్ని మొదలు పెట్టారు. ఏంటా రెసిపీ అంటే చిటికెడు కరుణ..పిడికెడు కోపం..బారెడు భీభత్సం...సరిపోయేంత..ఛఛ..సారీ మతిపోయేంత ప్రేమ... ఒక్కడు మిగిలాడు..- అంటూ ఈ మూవీలో విలన్స్ డెన్‌లో నాని చేసే భీభత్సం గురించి చిన్న ఇంట్రో ఇచ్చారు. ఈ వీడియోని చూస్తుంటే సినిమా ఓ రేంజ్‌లో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా భీభత్సం సృష్టించేలా ఉంది. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ బడ్జెట్‌తో ఈ మూవీని తెరపైకి తీసుకొస్తున్నారు ప్రొడ్యూసర్ వెంకట్ బోయినపల్లి. వీడియో ఎండింగ్‌లో నాని నంబర్ వన్ గ్యాంగ్ స్టార్ అంటూ చూపించి సినిమాపై హైప్‌ని క్రియేట్ చేశారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సమ్మర్‌లో ప్రారంభం కాబోతోంది. బాలీవుడ్ డ్రీమ్ గాళ్ మాధురీ దీక్షిత్ ఓ కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇక నానికి జోడీగా క్రేజీ హీరోయిన్ నటిస్తుందని తెలుస్తోంది. ఈ క్యారెక్టర్ కోసం ప్రస్తుతం ఇద్దరి పేర్లు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అందులో ఒకరు -యానిమల్- బ్యూటీ త్రిప్తి దిమ్రీ కాగా మరొకరు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ఇద్దరిలో ఎవరు ఫైనల్ అవుతారన్నది త్వరలోనే క్లారిటీ రానుంది. సమ్మర్‌లో భారీ స్థాయిలో ప్రారంభః కానున్న ఈ మూవీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

## పార్టీలో 'మాల'తో చరణ్.. క్లారిటీ ఇచ్చిన అల్లు శిరీష్




మెగా, అల్లు కుటుంబాల్లో ఏ చిన్న వేడుక జరిగినా అది సోషల్ మీడియాలో ఒక రేంజ్ లో వైరల్ అవుతుంటుంది. ప్రస్తుతం అల్లు వారి ఇంట్లో పెళ్లి బాజాలు మోగుతుండటంతో అటు ఫ్యాన్స్, ఇటు సినీ సెలబ్రిటీల సందడి మామూలుగా లేదు. మార్చి 6న జరగబోయే ఈ వేడుకకు సంబంధించి ఇప్పటికే నెట్టింట రకరకాల చర్చలు నడుస్తున్నాయి. పెళ్లికి ముందు అల్లు అర్జున్ తన తమ్ముడి కోసం ఇచ్చిన గ్రాండ్ పార్టీలోని కొన్ని మూమెంట్స్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ఇలాంటి సెలబ్రిటీ పార్టీలు అంటే గ్లామర్, సందడి మాత్రమే కాకుండా కొన్ని వివాదాలు కూడా తోడవుతుంటాయి. ఈ పార్టీలో తీసుకున్న ఒక గ్రూప్ ఫోటో బయటకు వచ్చినప్పటి నుండి సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. అల్లు శిరీష్ నయనిక జంటతో పాటు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, అల్లు అర్జున్ తమ భార్యలతో కలిసి ఈ ఫోటోలో కనిపించారు. అయితే ఈ ఫోటోలో ఒక సున్నితమైన అంశంపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో అల్లు శిరీష్ స్వయంగా స్పందించాల్సి వచ్చింది. ాశ్రీంశీ =ఘుస - సంక్రాంతి జోష్.. సమ్మర్ కంటిన్యూ చేయడం పక్కానా? అసలు విషయం ఏంటంటే, ఈ పార్టీకి రామ్ చరణ్ అయ్యప్ప మాలలో దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామి మాలలో ఉండి ఇలాంటి పార్టీలకు హాజరు కావడం ఏంటని, అక్కడ ఆల్కహాల్ వంటివి ఉంటే మాల నియమాలకు భంగం కలుగుతుంది కదా అని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేయడం మొదలుపెట్టారు. చరణ్ మాల దీక్షలో ఉండి ఇలాంటి వేడుకలకు వెళ్లడంపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు మొదలయ్యాయి. ఈ ట్రోల్స్‌కు అల్లు శిరీష్ తన ఇన్స్టాగ్రామ్ కామెంట్స్ ద్వారా గట్టి క్లారిటీ ఇచ్చారు. "స్వామి (రామ్ చరణ్) ఎవరూ ఆల్కహాల్ ముట్టుకోకముందే మా పార్టీకి వచ్చారు. మమ్మల్ని విష్ చేసి వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోయారు. లార్డ్ అయ్యప్ప పట్ల చరణ్ కు ఉన్న డెడికేషన్ నాకు చాలా ఇష్టం" అంటూ శిరీష్ ఆ కామెంట్‌కు రిప్లై ఇచ్చారు. ఈ వివరణతో చరణ్ పై వస్తున్న విమర్శలకు ఒకరకంగా చెక్ పడినట్లయింది. అల్లు శిరీష్ తన లాంగ్ టైమ్ లవర్ నయనిక రెడ్డిని మార్చి 6న వివాహం చేసుకోబోతున్నారు. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీతో పాటు చిత్ర పరిశ్రమకు చెందిన దిగ్గజాలు రాబోతున్నారు. ఇప్పటికే శిరీష్ తన తల్లిదండ్రులతో కలిసి కుటుంబ సభ్యులను పెళ్లికి ఆహ్వానిస్తున్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. తన కజిన్ పై వస్తున్న నెగిటివిటీని శిరీష్ ఇంత త్వరగా క్లియర్ చేయడం మెగా అల్లు అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం రామ్ చరణ్ తన తదుపరి చిత్రం 'పెద్ది'తో బిజీగా ఉన్నా, మాల నియమాలను పాటిస్తూనే కుటుంబ వేడుకలకు హాజరవుతున్నారు. శిరీష్ ఇచ్చిన ఈ క్లారిటీ ఇప్పుడు ఇంటర్నెట్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఇక బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న పెద్ది సినిమాను ఏప్రిల్ 30న విడుదల కానుంది. ఇక ఆ తరువాత సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమాను స్టార్ట్ చేయనున్నారు.

## 'అల్లు' ఇంటి 'బంగారం'

స్నేహారెడ్డి తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇది పసుపు దంచే -హల్దీ వేడుక నుంచి స్పెషల్ స్టిల్ అని కూడా తెలుస్తోంది. అల్లు శిరీష్ వివాహం ఈ ఏడాది మార్చి 6న జరగనుంది. నిజానికి అదే రోజు అల్లు అర్జున్ - స్నేహారెడ్డిల వివాహ వార్షికోత్సవం కూడా. మార్చి 6 అర్ధరాత్రి (తెల్లవారితే మార్చి 7) సుముహూర్తంలో శిరీష్ తన ప్రియురాలు నయనిక రెడ్డి మెడలో మూడు ముళ్లు వేయబోతున్నారు. మెగా కుటుంబం నుంచి మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ సహా టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఇప్పటికే జరిగిన కాక్టెయిల్ పార్టీలో పలువురు తారలు సందడి చేశారు. అల్లూ వారి వివాహం రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న ఒక ప్రముఖ ప్యాలెస్‌లో జరగబోతోందని సమాచారం. గతంలో నిహారిక కొణిదెల పెళ్లి ఉదయ్‌పూర్‌లో జరిగినట్లే.. శిరీష్ పెళ్లి కూడా ఒక చారిత్రక కట్టడంలో జరగనుంది. జైపూర్‌లో కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య పెళ్లి జరిగిన తర్వాత హైదరాబాద్‌లోని గచ్చిబౌలి లేదా నానక్‌రామ్‌గూడ ప్రాంతంలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో సినీరాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పెళ్లి వేడుకలకు సంబంధించిన పనులన్నీ -అల్లూ వారింటి బంగారం- స్నేహారెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



## ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్.. నా టాలెంట్ ఏంటో



ఇప్పుడెందుకు ఇలాంటి డైలాగులు అంటారేమో.. టీమ్ఇండియా పరిస్థితి కూడా ఇలాగే ఉంది. టీ20 ప్రపంచ కప్ లీగ్ స్టేజ్‌లో అజేయంగా సూపర్-8కి చేరుకున్న భారత్‌కు దక్షిణాఫ్రికా రూపంలో తొలి షాక్ తగిలింది. సెమీస్ అవకాశాల పైనే తీవ్ర ప్రభావం పడింది. మరి ఆ ఓటమిని మరిపించి.. సెమీస్ రేసులో మేమున్నామని మిగతా జట్లకు హెచ్చరికలు పంపించాల్సిన తరుణమిదే.

దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి తర్వాత టీమ్ఇండియా ప్లేయర్లు, మేనేజ్‌మెంట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చెలరేగాయి. 'బాధ్యతగా ఆడలేదు.. వ్యూహాలు బాగోలేవు. ఫలానా ప్లేయర్ రాణించడం లేదు.. లౌక్యం ప్రదర్శించడం లేదు' అని తెగ విమర్శలు వచ్చాయి. అవును నిజమే.. మన ప్లేయర్లు ఆ మ్యాచ్‌లో సరిగా ఆడలేదు. అలాగని వారి సత్తాను మరీ తక్కువగా అంచనా వేయాల్సిన అవసరం లేదు. జట్టులోని టాప్ -7 ఆటగాళ్లు ఒక్కసారి కుదురుకుంటే ఎంతటి విధ్వంసం సృష్టిస్తారో గతంలో ఎన్నోసార్లు చూశాం. ఇప్పుడు కావాల్సిందీ ఆ వీరోచిత ఇన్నింగ్సే..! టీ20 ప్రపంచ కప్ ముందు వరకు అభిషేక్ శర్మ పైనే అందరి కళ్లూ. ఈ డేంజరస్ బ్యాటర్ నుంచి ఎలాంటి విధ్వంసకర ఇన్నింగ్స్ వస్తాయనేది చాలామంది అభిమానులు ఆశగా ఎదురుచూశారు. కానీ తాను ఆడిన తొలి మూడు మ్యాచుల్లో డకౌట్లు అయి నిరాశ పరిచాడు. ఇక నాలుగో మ్యాచ్‌లో పరుగుల ఖాతా తెరిచాడని.. సంబరపడేలోగా 15 రన్స్‌కే పెవిలియన్ బాట పట్టాడు. ప్రతి బంతినీ భారీ షాట్ కొడదామంటే అన్ని సందర్భాల్లోనూ కుదరని పని. కాస్త ఓర్పు ప్రదర్శించాలి. పవర్ ప్లేలో అదిరే ఆరంభం ఇద్దామని భావించినా.. ఒక్కోసారి కుదరదు. క్రీజ్‌లో నిలదొక్కుకుంటే ప్రత్యర్థి బౌలర్‌కు చెమటలు పట్టడం ఖాయం. పిచ్ పరిస్థితిని అంచనా వేసి బంతిని బాదాలి. ఒక్కసారి టీ20 ప్రపంచకప్ ముందు ఫామ్‌ను గుర్తు చేసుకుంటే చాలు.

టీ20ల్లో వన్‌డౌన్ ఎంతటి కీలక స్థానమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కెప్టెన్ సూర్య నుంచి తనకు ఎంతో ఇష్టమైన ఈ ప్లేస్‌ను అడిగి మరీ తీసుకున్న హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ ఎందుకో తెలియని 'ప్రెషర్'కు గురవుతున్నాడు. సూపర్ క్యాచెస్ అందుకొనే అతడు ఫీల్డింగ్‌లోనూ 'కంగారు' పడ్డాడు. ఆరంభంలో ఇన్నింగ్స్‌ను నిర్మించి.. ఆఖర్లో దూకుడుగా ఆడే తన మార్క్ స్టైల్‌ను తీసుకొస్తే టీమ్ఇండియాకు తిరుగే ఉండదు. ఒక్కసారి 'పాక్'పై ఆసియా కప్ ఫైనల్‌ను తిలక్ గుర్తుచేసుకుంటే చాలు. టీమ్ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య క్రీజ్‌లో ఉన్నాడంటే విజయంపై నమ్మకాలు ఉండేవి. అంతర్జాతీయ మ్యాచులతోపాటు ఐపీఎల్‌లోనూ 'నేను' ఉన్నానని భరోసా ఇచ్చేవాడు. గత టీ20 ప్రపంచ కప్‌లో తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఫైనల్‌లో అతడే చివరి ఓవర్‌ను సంధించాడు. ఇప్పుడు కూడా టీమ్ఇండియాకు కీలక సమయం. రెండు మ్యాచుల్లో భారీగా గెలిస్తేనే 'సెమీస్'కు చేరే ఛాన్స్. తనకొచ్చిన 'స్టార్ ఆల్‌రౌండర్' బిరుదు ఏదో గాలివాటంగా రాలేదని నిరూపించుకోవాల్సిన తరుణం. ఐదు లేదా ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగితే ప్రత్యర్థి బౌలర్లు అదిరిపోవాలి. బంతిని 'చే'బడితే వికెట్లు నేలకూలాలి. అందుకు కాస్త లౌక్యం ప్రదర్శించాలి. ఒకేలా బంతిని విసురుతామంటే ఇప్పుడు కుదరడం లేదు. వేగంగా పరుగెడుతూ వచ్చి బ్యాటర్లను కన్‌ఫ్యూజ్ చేసేలా బౌలింగ్ చేయాలి.

ఇప్పుడు జట్టులో శివమ్ దూబె అత్యంత కీలక సభ్యుడు. బ్యాటర్‌గా ఆరో స్థానంలో వచ్చి ఎటాకింగ్ గేమ్ ఆడతాడు. అందులో అతడిపై అభిమానులకు ఎలాంటి సందేహం లేదు. కానీ, మేనేజ్‌మెంట్ దూబెను మీడియం పేస్ ఆల్‌రౌండర్‌గా భావిస్తోంది. తన రెండో కర్తవ్యాన్ని ఇంకాస్త మెరుగ్గా నిర్వర్తించాల్సిన బాధ్యత దూబెపై ఉంది. పిచ్‌ను సద్వినియోగం చేసుకుని పేస్ బౌలర్లే తమ స్పీడ్‌ను తగ్గించుకుని బంతులేస్తున్నారు. అలాంటిది దూబె నుంచి పదునైన 'స్లో' బంతులు వస్తే బ్యాటర్లకు పెను సవాల్‌గా మారతాడు.

**కింకర్తవ్యం..?**

చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు పెద్దలు. ఇప్పుడు జింబాబ్వే 'పసి కూన' కూడా కాదు. ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లకే షాక్ ఇచ్చి ఈ స్టేజ్‌కు వచ్చింది. మరి అలాంటి టీమ్‌ను తక్కువగా అంచనా వేయకూడదు. అసలే మనం డిఫెండింగ్ ఛాంపియన్లం. మరోసారి, అదేతరహా గేమ్‌ను ప్రదర్శిస్తే మ్యాచ్ ఏంటి.. సెమీస్ బెర్తుకు రూటూ ఆటోమేటిక్‌గా పడిపోతుంది. జింబాబ్వేపై వెస్టిండీస్ ఆడిన తీరు గుర్తుంది కదా.. అలాగే మనం కూడా ఏమాత్రం కనికరం లేకుండా దూకుడు ప్రదర్శించాల్సిందే.

## కివీస్ సెమీస్ ఆశలు సజీవం

ఆతిథ్య శ్రీలంకకు షాక్! సూపర్-8లో మరో మ్యాచ్ ఉండగానే ఆ జట్టు టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. బుధవారం న్యూజిలాండ్‌తో గ్రూప్-2 పోరులో ఆఖరి ఓవర్లలో పరుగులు ఇచ్చేసి.. ఆ తర్వాత బ్యాట్‌తో విఫలమైన లంక 61 పరుగుల తేడాతో చిత్తయింది. మొదట న్యూజిలాండ్ 7 వికెట్లకు 168 పరుగులు చేసింది. శాంట్నర్ (47; 26 బంతుల్లో 2ఐ4, 4ఐ6), రచిన్ రవీంద్ర (32; 22 బంతుల్లో 3ఐ4, 1ఐ6), మెకాంకీ (31 నాటౌట్; 23 బంతుల్లో 3ఐ4, 2ఐ6) మెరిశారు. తీక్షణ (3/30), చమీర (3/38) ఆకట్టుకున్నారు. ఛేదనలో రచిన్ (4/27), హెన్రీ (2/3), శాంట్నర్ (1/19) విజృంభించడంతో లంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 107 పరుగులే చేయగలిగింది. కమిందు మెండిస్ (31; 23 బంతుల్లో 4ఐ4), వెల్లలాగే (29; 23 బంతుల్లో 2ఐ4, 1ఐ6) మాత్రమే పోరాడారు.

విజృంభించిన రచిన్: అలవాటైన పిచ్.. మరీ పెద్ద స్కోరు కాదు..కానీ శ్రీలంక ఆరంభం నుంచే తడబడింది. తొలి బంతికే నిశాంక (0) ఔటైపోవడం ఆ జట్టుకు పెద్ద దెబ్బ. అసలంక (5) కూడా నిలవలేదు. ఈ రెండు వికెట్లు పేసర్ హెన్రీ ఖాతాలోకి వెళ్లాయి. తర్వాత కుశాల్ మెండిస్ (11), పవన్ రత్నాయకే (10) వికెట్ల పతనాన్ని ఆపగలిగారు కానీ.. పరుగులు మాత్రం చేయలేకపోయారు. వీళ్లిద్దరూ ఆత్మరక్షణకు పోయి మరీ నెమ్మదిగా ఆడడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోయింది. 8 ఓవర్లకు 27/2తో లంక ఛేదనలో వెనకబడింది. దీనికి తోడు పతనం మళ్లీ మొదలైంది. స్పిన్నర్ రచిన్ రవీంద్ర విజృంభించడంతో లంక బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మొదట 9వ ఓవర్లో కుశాల్, పవన్‌లను ఔట్ చేసిన రచిన్.. ఆ తర్వాత శానక (3), హేమంత (3) వికెట్లను పడగొట్టి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు. కాసేపు నిలిచి కమిందు మెండిస్ కూడా నిష్క్రమించాడు. చివర్లో వెల్లలాగే పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది. లంక ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లను న్యూజిలాండ్ స్పిన్నర్లతోనే వేయించింది.

పడి లేచిన కివీస్: 30/0.. 84/6.. 168/7.. ఇదీ న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సాగిన తీరు. ఆ జట్టు ఇన్నింగ్స్‌ను ధాటిగానే మొదలుపెట్టింది. ఓవర్‌కు పది రన్‌రేట్‌తో పరుగులు చేసింది. ఉన్నంతసేపు అలెన్ (23; 13 బంతుల్లో 3ఐ4, 1ఐ6) దూకుడుగా ఆడాడు. తీక్షణ, చమీర విజృంభించడంతో పరిస్థితి మారిపోయింది. ఓవర్ తేడాతో అలెన్, సీఫర్ట్ (8) పెవిలియన్ చేరిపోయారు. రచిన్ రవీంద్ర, ఫిలిప్స్ (18) కాసేపు వికెట్ల పతనం ఆపారు. స్వల్ప వ్యవధిలో ఫిలిప్స్, రచిన్, చాప్‌మన్ (0), మిచెల్ (3) ఔట్ కావడంతో కివీస్ 84/6తో కష్టాల్లో చిక్కుకుంది. లంక బౌలర్ల జోరు చూస్తే ఆ జట్టు వంద పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ కివీస్ అనూహ్యంగా పుంజుకుంది. కెప్టెన్ శాంట్నర్, మెకాంకీ బాదుడు మొదలుపెట్టారు. చమీర వేసిన 17వ ఓవర్లో మెకాంకీ 2 సిక్సులు, ఓ ఫోర్ కొట్టి స్కోరుబోర్డు



కదిలించగా.. ఆ తర్వాతి ఓవర్లో శాంట్నర్ అందుకున్నాడు. తీక్షణ బౌలింగ్‌లో రెండు సిక్సులు, ఫోర్ కొట్టాడు. ఈ జంట అదే జోరు కొనసాగించడంతో 19వ ఓవర్లో 19.. ఆఖరి ఓవర్లో 12 పరుగులొచ్చాయి. కివీస్ స్కోరు 160 దాటింది. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి శాంట్నర్ ఔటయ్యాడు. చివరి 4 ఓవర్లలో న్యూజిలాండ్ ఏకంగా 70 పరుగులు రాబట్టడం విశేషం.

కివీస్ మెరుగ్గా...

ఆడిన రెండు మ్యాచ్‌లూ ఓడిన లంక సెమీస్‌కు దూరం కాగా... లంకపై భారీ విజయంతో కివీస్ సెమీస్‌కు చేరువైంది. పాక్‌తో మ్యాచ్ వర్షంతో రద్దవడంతో పాయింట్లు పంచుకున్న న్యూజిలాండ్ ఖాతాలో ప్రస్తుతం 3 పాయింట్లున్నాయి. ఒక మ్యాచ్ రద్దయి, ఒక మ్యాచ్‌లో ఓడిన పాకిస్థాన్ (1) మూడో స్థానంలో ఉంది. ఈ గ్రూప్ నుంచి ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీస్ చేరింది. శుక్రవారం న్యూజిలాండ్‌తో ఇంగ్లాండ్.. శనివారం పాకిస్థాన్‌తో లంక తలపడాల్సి ఉంది. ఇంగ్లాండ్‌పై న్యూజిలాండ్ గెలిస్తే 5 పాయింట్లతో నేరుగా సెమీస్ చేరుతుంది. ఒకవేళ ఓడినా ఆ జట్టుకు అవకాశం ఉంటుంది. పాక్ (-0.461)తో పోలిస్తే కివీస్ (3.050)కు మెరుగైన రన్‌రేట్ ఉండడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో పాక్ ముందంజ వేయాలంటే.. లంకపై ఆ జట్టు భారీ తేడాతో గెలవాలి, అంతకుముందు ఇంగ్లాండ్ చేతిలో కివీస్ ఓడాలి.

## పాక్ ఆటగాళ్లపై వివక్ష వద్దు: ఈసీబీ

'ది హండ్రెడ్' క్రికెట్ లీగ్ వేలంలో ఆటగాళ్ల జాతీయతను ప్రాతిపదికగా తీసుకుని వారిని పక్కన పెట్టకూడదని ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), ఫ్రాంచైజీలు స్పష్టంచేశాయి. ముఖ్యంగా భారత యాజమాన్యంలోని జట్లు పాకిస్థాన్ క్రికెటర్లను కావాలనే విస్మరిస్తాయనే ఆందోళనల నేపథ్యంలో ఈ సంయుక్త ప్రకటన వెలువడింది. లీగ్‌లో నాలుగు ఫ్రాంచైజీలు భారత యాజమాన్యాల చేతిలో ఉన్నాయి. "జాతి, లింగ లేదా జాతీయతతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రికెట్లో భాగమని భావించాలి. కేవలం జాతీయత కారణంగా ఏ ఆటగాడిని దూరం పెట్టకూడదు" అని ఈసీబీ, మొత్తం 8 ఫ్రాంచైజీలు సంయుక్తంగా ప్రకటనలో తెలిపాయి. మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ (ఆర్‌పీఎస్‌జీ గ్రూపు), ఎమ్ఐ లండన్ (రిలయన్స్), సదరన్ బ్రేవ్ (జీఎంఆర్), సన్‌రైజర్స్ లీడ్స్ (సన్ గ్రూపు) జట్లు ఐపీఎల్ యాజమాన్యాలతో ముడిపడి ఉన్నాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం ఈ నాలుగు ఫ్రాంచైజీలు వేలంలో పాక్ ఆటగాళ్లకు దూరంగా ఉండే అవకాశముంది. గత ఏడాది యాజమాన్యాలలో భారతీయులు లేకపోయినా.. కేవలం ఇద్దరు పాక్ ఆటగాళ్లు మాత్రమే లీగ్‌లో భాగమయ్యారు. మొత్తంమీద తొలి 5 సీజన్‌లలో తొమ్మిది మంది పాక్ ఆటగాళ్లు మాత్రమే పాల్గొన్నారు.

## భారత్‌కు మేలుకొలుపు

సూపర్ 8లో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం భారత జట్టుకు ఒకరకంగా మేలు చేసేదేనని మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్‌లో కీలక దశకు ముందు లోపాల్ని సరిదిద్దుకోడానికి, వ్యూహాల్ని సమీక్షించుకోడానికి ఈ ఓటమి ఎంతో అవసరమని రవిశాస్త్రి తెలిపాడు. "వరుసగా 12 మ్యాచ్‌లు గెలిచినప్పుడు ఏదో ఒకరోజు ఆట కలిసిరాకపోవచ్చు. ఆ రోజు ముందే రావడం మంచిదైంది. ఇది జట్టును మేలుకొలుపుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతివిశ్వాసానికి పోకుండా.. జట్టు కూర్పుపై పునరాలోచించుకోవాలి. సూపర్ 8 దశలో మరో మ్యాచ్‌లో ఓడితే జట్టు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లే ప్రమాదముంది. అక్షర్ పటేల్ వంటి అనుభవజ్ఞుడు జట్టులో ఉండాలి. అక్షర్, వాషింగ్టన్ సుందర్ ఇద్దరినీ ఆడించాలి. దీనివల్ల బౌలింగ్‌లో అదనపు ప్రత్యామ్నాయం లభిస్తుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తిలా ఎవరైనా బౌలర్ విఫలమైనప్పుడు అదనపు స్పిన్నర్ ఉండటం లాభిస్తుంది. అక్షర్ ఆడితే అతను ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. హార్దిక్ పాండ్య (5), శివమ్ దూబె (6), సుందర్ (7) వంటి హిట్టర్లు ఉన్నప్పుడు బ్యాటింగ్ గురించి ఆందోళన అవసరం ఉండదు. ఎనిమిది మంది బ్యాటర్లు ఉన్నా కూడా లక్ష్యాన్ని ఛేదించలేకపోతే అది బ్యాటింగ్ వైఫల్యమే అవుతుంది. బౌలింగ్ విభాగమూ బలోపేతం అవుతుంది" అని రవిశాస్త్రి పేర్కొన్నాడు.



VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com